విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

బుధవారం 12 ఫిబ్రవరి 2025   8 పేజీలు

బర్డ్ ఫ్లూ...ఆందోళన

- వైరస్ వ్యాప్తి చెందుతున్నా పట్టనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు
- వైరస్ నిరోధానికి చర్యలు తీసుకోవాలి
- పంట కాలువల్లోకి మృతి చెందిన కోళ్లు
- మిర్తిపాడులో 8వేల కోళ్లు మృత్యువాత

విశాలాంధ్ర-లింగపాలెం/భీమవరం/కొవ్వూరు/సీతానగరం : ఉభయగోదావరి జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ వ్యాధి కలకలం రేపటంతో కోళ్ల పెంపకపుదారులు, ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో పశుసంవర్ధక శాఖకు చెందిన ఒక స్థాయిలో ఉన్న అధికారులు, వైద్యులు కొందరు అందుబాటులో ఉండటం లేదని ఫోన్లు చేసినా స్పందించడం లేదని పెంపకపుదారులు, ప్రజలు వీరి వ్యవహార తీరుపై తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఇదేమి నిర్లక్ష్యమని ఇటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు ఉన్నతాధి కారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. బర్డ్ ఫ్లూ కలకలంతో ప్రజలు గుడ్డు, కోడి మాంసం తినేందుకు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలల్లో, వసతి గృహాలలో, అంగన్వాడీ కేంద్రాలలో గుడ్డు తప్పని సరిగా విద్యార్థులకు అందిం చాలి. ఇటువంటి సమ యంలో గుడ్డు పెట్టడం వల్ల విద్యార్థులకు అనారోగ్య పరిస్థితులు తలెత్తితే పరిస్థితి ఏంటని? సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. బర్డ్ ఫ్లూ వల్ల ఉభయ గోదావరి జిల్లాల్లోని పలు ప్రాంతాలలో అధిక సంఖ్యలో కోళ్లు చనిపోవడం ఈ ప్రాంతాలలో కోళ్లు చనిపోవటానికి బర్డ్ ఫ్లూ సోకటమేనని నిర్ధారణ కావడంతో ఈ ప్రాంతాలలో రెడ్ జోన్,సర్వే లెన్స్ జోన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈవైరస్ ఆ ప్రాంతాలకే పరిమితం కాకుండా ఇతర ప్రాంతాలకు వ్యాప్తి చెందుతుందా? అనే ఆందోళన ప్రతి ఒక్కరిలో నెలకొంది. నవంబర్, డిసెంబర్లో కొక్కరవ్యాధి సోకి వేలాది నాటు కోళ్లు మృతి చెందాయి. పెంపకపుదారులు ఆర్థికంగా నష్టపోయారు. దీని నుంచి కోలుకోక ముందే ఇప్పుడు బర్డ్‌ఫ్లూ వల్ల ఏం జరుగుతుంది? ఏం జరగబోతుందనే ఆందోళనతో కోళ్ల పెంపకపుదారులు, ప్రజలు ఉన్నారు. ఆర్థికపరమైన ఇబ్బందులు సంగతి పక్కన పెడితే ఆరోగ్యపరమైన ఇబ్బందులపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాలలో ఎటువంటి జాగ్రత్తలు లేకపోవడం వల్ల కోడి మాంసం,గుడ్లు విక్రయాలు ▶మిగతా 2లో..

సైబర్ నేరాలపై అప్రమత్తం

విశాలాంధ్ర - కాకినాడ : నేడు జరుగుతున్న అనేక సైబర్ నేరాలను కొద్దిపాటి అప్రమత్తత పాటించడం ద్వారా మనల్ని మనం కాపాడు కోపాడుకోవడమే కాకుండా మన కుటుంబాన్ని కూడా కాపాడు కోవచ్చని ఎన్ఐసి డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మాటిక్ ఆఫీసర్ సిహెచ్‌వివిఎస్ సుబ్బారావు తెలిపారు. మంగళవారం ఉదయం నిక కలెక్టరేట్ విధాల గౌతమీ సమావేశ మందిరంలో నేషనల్ ఇన్ఫర్మాటిక్ సెంటర్ ఆధ్వర్యంలో ఇంటర్నెట్ సేఫ్ డే సందర్భంగా వివిధ శాఖల ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిఐఓ సుబ్బారావు మాట్లాడుతూ రోజు రోజుకు పెరిగి పోతున్న సైబర్ నేరాలను ప్రజలందరూ ఇంటర్నెట్ వినియోగంలో కొద్ది పాటి అప్రమత్తత పాటించడం ద్వారా మన సమాచారాన్ని వేరొకరికి చేరకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. తద్వారా మనల్ని మనం ఈ సైబర్ నేరగాళ్ల ఉచ్చు నుంచి ▶మిగతా 2లో..

ఆదివాసీ గిరిజనులపై మారణకాండను ఆపాలి

ప్రజాసంఘాల డిమాండ్

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం : దండకారణ్యంలో ఆదివాసీ గిరిజన ప్రజలపై కేంద్ర ప్రభుత్వం సాగిస్తున్న నిర్బంధకాండను, రక్తపాతాన్ని ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ అన్నారు. ఆపరేషన్ కగార్‌ను ఆపివేయాలని సహజ వనరుల దోపిడీని అరికట్టాలని కోరుతూ వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం కపర్ది భవన్లో మంగళవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో డి.సోమసుందర్ మాట్లాడారు. ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ కే మస్తాన్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఇండియన్ జర్నలిస్టుల యూనియన్ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ మాట్లాడుతూ దండకారణ్యం పరిసరాలలో ఉన్న ఏడు రాష్ట్రాలలోని సహజవనరులను అదానీ , అంబానీ కార్పొరేట్ బిలియనీర్లకు కట్టబెట్టడానికి కేంద్రం పూనుకున్నదని అందులో భాగంగానే ముంబయి నుండి గంగవరం పోర్టుకు భారీ రహదారి నిర్మాణం చేపట్టిందని వివరించారు. గంగవరం పోర్టు విస్తరణ కోసం విశాఖ ఉక్కు కర్మాగారం భూములపై కేంద్రం కన్ను వేసిందని సోమసుందర్ వివరించారు. మావోయిస్టుల బూచిని చూపించి ఆదివాసీ గిరిజన ప్రజల హక్కులను కేంద్రం హరిస్తున్నదని అన్నారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి చిట్టిబాబు, మాట్లాడుతూ ఛత్తీస్ గడ్ లో ఆదివాసీ ప్రాంతాల్లో ఉన్న సహజ వనరుల దోపిడీకోసం కగార్ యుద్ధం జరుగుతున్నదని, అక్కడ వనరులను కార్పొరేట్ కంపెనీలకు దోచి పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న మారణకాండ అని అన్నారు. ఆదివాసీ చట్టాలను హక్కులను హననం చేస్తూ సాయుధ బలగాలను లక్షల్లో మోహరించి, 600 కు పైగా పోలీస్ క్యాంపులు పెట్టి ఆధునిక టెక్నాలజీ ఆయుధాలతో వందలాది మందిని ఎన్‌కౌంటర్ల పేరుతో హతమార్చుతున్నారని ఎక్కువగా ఆదివాసీలు మహిళలు ▶మిగతా 2లో..

బలివే ఉత్సవ ఏర్పాట్లపై సమీక్ష

- సమన్వయంతో పనిచేసి ఉత్సవాన్ని జయప్రదం చేయండి
- సబ్ కలెక్టర్ స్మరణ రాజ్

విశాలాంధ్ర- ముసునూరు: మండలంలోని బలివే శ్రీ రామలింగేశ్వరస్వామి కళ్యాణోత్సవ ఏర్పాట్లను నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ రాజ్ మంగళవారం ఆయా శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం బలివే శ్రీ రామలింగేశ్వర ఉత్సవాల నోడల్ అధికారి తహసీల్దార్ కె.రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్య నిర్వహణ అధికారి పామర్తి సీతారామయ్య భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఎక్కడెక్కడ ఏవిధమైన ఏర్పాట్లు చేస్తున్నది మ్యాప్ ద్వారా చూపిస్తూ సబ్ కలెక్టర్కు వివరించారు. డిఎస్పి కే వి వి ఎన్ ప్రసాద్ భక్తుల భద్రత దృష్ట్యా పోలీస్ శాఖ వారికి పలు సూచనలు, సలహాలు అందించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు సంచరించే ప్రదేశాలలో 16 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించేలా పోలీస్ శాఖ తగు జాగ్రత్తలు తీసుకుంటుందని అన్నారు. విద్యుత్ శాఖ ఏఈ వీరబాబు ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి ఎటువంటి విద్యుత్ అంతరాయం కలుగకుండా నిరంతరం సిబ్బందితో కలిసి పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ శిబిరాన్ని ఏర్పాటు చేసి అత్యవసర సేవలకు ▶మిగతా 2లో..

బంద్ ప్రశాంతం

విశాలాంధ్ర - కుక్కునూరు: 48 గంటల నిరవధిక బంద్‌లో భాగంగా మంగళవారం కుక్కునూరు మండలంలో బంద్ సంపూర్ణంగా కొనసాగుతుంది. లోకసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు గిరిజన ఏజెన్సీ చట్టాలపై చేసిన కామెంట్లను నిరసిస్తూ వివిధ గిరిజన సంఘాల నాయకుల ఆధ్వర్యంలో కుక్కునూరు ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, వ్యాపార సముదాయాలు ▶మిగతా 2లో..

గురుకులాల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల

విశాలాంధ్ర-ఏలూరు: ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించ బడుతున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి (ఇంగ్లీషు మాధ్యమం), ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశమునకు బాలురు, బాలికల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా సమన్వయ అధికారి బి. ఉమాకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు ఈ నెల 7వ తేదీ నుండి వచ్చే నెల మార్చి 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. ప్రవేశ పరీక్ష 2025 ఏప్రిల్ ఆరవ తేదీ, ఉదయం గం.10 నుండి 12వరకు, ఐదవ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్స రం మధ్యాహ్నం గం.2. నుండి 4.30 వరకు జరుగుతుందని తెలిపారు. ఇతర వివరాలకు కె.శేఖర్ 9963007079, టి.పవన్ 9666699243, సిహెచ్. వీరాస్వామి 970551508 నెంబర్లను సంప్రదించవచ్చున్నారు.

పాఠశాల తనిఖీ

విశాలాంధ్ర-లింగపాలెం: రంగాపురం ఉన్నత పాఠశాలలో డిఆర్పి డి.వెంకటరాజు తనిఖీలు నిర్వహించారు. మధ్యాహ్న భోజన పథకం నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. పాఠశాల

రికార్డులను తనిఖీ చేశారు. విద్యా ప్రమాణాలపై విద్యార్థులతో ముఖాముఖి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పదో తరగతి పరీక్షల గురించి వివరించారు. ఏకాగ్రతతో ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈయనతోపాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరత్నం ఉన్నారు.

భేటీ బచావో- భేటీ పడావో పై అవగాహన

విశాలాంధ్ర - పాలకోడేరు : భేటీ బచావో- భేటీ పడావో అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆకివీడు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ వాణి విజయరత్నం ఆధ్వర్యంలో

అవగాహన, స్కూల్ విద్యార్థినిలచే సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ వాణి విజయరత్నం మాట్లాడుతూ అనాదిగా ఆడ పిల్లలను చిన్న చూపు చూస్తున్నారని ఆధునిక సమాజంలో ఆడపిల్లల భవిష్యత్తు రూపు రేఖలు మార్చాలంటే ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలన్నారు. ర్యాలీ అనంతరం బుతుస్రావంలో పరిశుభ్రత గురించి వివరించి మొక్కలు నాటించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు మహేష్ బాబు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు పార్వతి, సూర్య కుమారి, అంగన్వాడి టీచర్లు విమల, శాంత కుమారి, రమణ, జ్యోతి, ధనలక్ష్మి, పాఠశాల మహిళా టీచర్లు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

కె.ఎస్ లక్ష్మణరావుకు ప్రథమ ప్రాధాన్యత ఓటుతో గెలిపించండి

విశాలాంధ్ర - కలిదిండి : కృష్ణ - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక, పెన్షనర్లు, కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు కార్మిక, కర్షక, మహిళ, వివిధ ప్రజా సంఘాలు బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి కే ఎస్ లక్ష్మణరావు కు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. సోమవారం కలిదిండిలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కే. శ్రీనివాస్ మాట్లాడుతూ లక్ష్మణరావు ప్రజా సమస్యలపై ఎమ్మెల్సీగా శాసనమండలిలో ప్రజల గొంతు వినిపించడంతోపాటు నిరుద్యోగ సమస్యల పైన రైతాంగ కార్మిక సమస్యల పైన అన్ని వర్గాల ప్రజల సమస్యల పైన ప్రత్యక్ష ఉద్యమాలలో పాల్గొన్నారని నిరంతరం ప్రజల సమస్యలపై పనిచేసే లక్ష్మణరావుకు ఓటు వేసి గెలిపించడం ద్వారా శాసనమండలికి ఎన్నుకోవాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు, సిఐటియు మండల కార్యదర్శి జక్కుల మహేష్, పెరుమాళ్ళ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మారణకాండ (1వ పేజీ తరువాయి)

చంపబడుతున్నారని వెంటనే ఆపరేషన్ కగార్ యుద్ధాన్ని ఆపాలని చిట్టిబాబు డిమాండ్ చేశారు. కుల నిర్మూలనా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కె. కృష్ణ మాట్లాడుతూ ఎన్ కౌంటర్లను, ఆదివాసీలపై హత్యా కాండ ఆపాలని సహజ వనరులు పై దేశపౌరులందరికి హక్కు ఉందని వనరులు కాపాడుకోవాలని పర్యావరణాన్ని రక్షించుకోవాలని అన్నారు. సమావేశంలో న్యూడెమోక్రసి జిల్లా నాయకులు ఎం. దాన వరప్రసాద్, ఏఐటీయుసి ఏరియా కమిటీ కార్యదర్శి మండలపర్తి హరీష్, బహుజన కులాల నాయకులు చింతపల్లి గురుప్రసాద్, బహుజన సమాజ్‌వాది పార్టీ నాయకురాలు ఎం.షర్మిల ,బహుజనసేన నాయకులు గుంపుల సత్య కృష్ణ, కే ఎన్ పి.ఎస్ నాయకులు మెరిపో జాన్‌రాజు, వేమన ఫౌండేషన్ ప్రతినిధి ప్రసాద్, పి. కె. ఎస్. జిల్లా కమిటీ సభ్యుడు పి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సమీక్ష (1వ పేజీ తరువాయి)

108ని కూడా అందుబాటులో ఉంచుకోవాలని ముసునూరు పిహెచ్‌సి వైద్యురాలు షకీలా ఇవాంజెలిన్‌కు కలెక్టర్ సూచించారు. అగ్నిమాపక శకటాన్ని సిద్ధంగా ఉంచి, విపత్తుల నివారణ, అత్యవసర సేవలకు సిద్ధంగా ఉండాలని అగ్నిమాపక శాఖకు కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ముసునూరు ఎస్ఐ ఎం. చిరంజీవి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మానం గంటేశ్వరరావు, అయ్యా శేఖర, అధికారులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అప్రమత్తం (1వ పేజీ తరువాయి)

కాపాడు కోపాడుకోవడమే కాకుండా మన కుటుంబాన్ని కాపాడుకోవచ్చ న్నారు. భారత ప్రభుత్వం, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ టుగెదర్ ఫర్ బెటర్ ఇంటర్నెట్ అనే నినాదంతో ప్రజలందరూ ఇంటర్నెట్‌ను సురక్షితంగా ఉపయోగించుకోవాలనే ఉద్దేశ్యంతో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి మాసంలోని రెండవ మంగళవారాన్ని ఇంటర్నెట్ సేఫ్ డేగా నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయం సైబర్ క్రైమ్ విభాగానికి సంబంధించి దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ చాలా వరకు నేరాలు మన అప్రమత్తం లేకపోవడం వలనే జరుగుతున్నాయన్నారు. సోషల్ మీడియాలో, ఎస్ఎంఎస్‌ల ద్వారా వచ్చే లింక్‌లు క్లిక్ చేసే సమయంలో జాగ్రత్త వహించాలని, మనకు తెలియని సోర్స్ నుండి వచ్చే లింక్‌లకు ప్రతిస్పందించకపోవడమే మేలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూ (1వ పేజీ తరువాయి)

ఆంక్షలు లేవు. కనీసం సూచనలు చేసే వారు కూడా అందుబాటులో ఉండటం లేదు. నిర్లక్ష్యంగా ఉంటే వైరస్ విజృంభించే అవకాశాలు ఉన్నాయని ప్రతి ఒక్కరిలో ఆందోళన నెలకొంది. ఇటువంటి ఆందోళనకర పరిస్థితుల్లో సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు సూచనలు చేయాల్సి ఉంది. తమ ప్రాంతంలో వైరస్ లక్షణాలు లేవు, మరో ప్రాంతంలో వైరస్ ఉంటే మాకేంటి అన్నట్లుగా సంబంధిత అధికారులు కొందరు వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇటువంటి వారు సక్రమంగా విధులు నిర్వర్తించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రతి ఒక్కరూ కోరుతున్నారు.

కాలువలో మృతి చెందిన కోళ్లు

విశాలాంధ్ర -భీమవరంటౌన్ : వైరస్‌తో మృతి చెందిన కోళ్ళు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం జివిన్‌వి కెనాల్‌లో కొట్టుకు వస్తున్నాయి. తణుకు, తాడేపల్లిగూడెం, వేల్పూర్, తదితర ఏరియాల్లో కోళ్ల ఫారాలు ఉంటాయి. గత కొన్ని రోజుల నుండి కోళ్లకు వైరస్ సోకి భారీ సంఖ్యలో కోళు మృత్యువాత పడుతున్నాయి. దీంతో ఆ యజమానులు వైరస్ తో చనిపోయిన కోళ్లను మూటలు కట్టి కాలువలో పడవేస్తున్నారు . అవి కాస్త దిగువ భీమవరం పంట కాలవలో వారం రోజులుగా కోళ్ళు కొట్టుకు రావటంతో దుర్వాసన వస్తున్నది. ఇలా మృత్యువాత పడిన కోళ్లను ల్యాబ్ పరీక్షలకు పంపగా అవి ఏవిఏస్ ఇన్ఫు ఎంజాయ్ గా గుర్తించారు, ఇవే కోళ్ళ మృత కళేబరాలు కాలువలో కొట్టుకు రావటంతో దుర్వాసనతో కలుషితంగా జివిన్వీ కెనాల్ మారిందని, ఈ పంట కాలువ నీరునే ప్రజలు తాగే పరిస్థితి ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైరస్ తో చనిపోయిన కోళ్లను గొయ్యి తీసి పెట్టకుండా పంట కాలువల్లో వెయ్యటాన్ని అధికారులు అడ్డుకోవాలని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్న అధికారులు

విశాలాంధ్ర-కొవ్వూరు : ఉమ్మడి గోదావరి జిల్లాల్లో బర్డ్‌ఫ్లూతో కోళ్లు మృత్యువాతపడుతున్నాయి. నిడదవోలు, రాజమండ్రి, పశ్చిమగోదావరి జిల్లా తణుకులో వేలాది కోళ్ల ఫారాలు ఉన్నాయి.

ఈ వైరస్ రావడంతో దాదాపు రెండు లక్షల కోళ్లు మృత్యువాత పడ్డాయని పశు వైద్య అధికారులు చెబుతున్నారు.

నిడదవోలు, తణుకు, రాజమండ్రి గ్రామాల నుంచి కొవ్వూరు కు ప్రతిరోజు కోళ్లు తరలివస్తున్నా కోడి మాంసం వ్యాపారులు అవేమీ లెక్క చేయకుండా వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. ఈ విషయమై కొవ్వూరు మున్సిపాలిటీ ఇన్‌చార్జి, శానిటరీ ఇన్‌చార్జి రవిని వివరణ కోరగా ఈ విషయం పశుసంవర్ధకశాఖ అధికారులు చూస్తున్నారని తెలిపారు.

మృత్యువాత పడ్డ 8 వేల కోళ్లు

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలోని మిర్తిపాడు గ్రామంలో సుమారు 8వేల కోళ్లు మృత్యువాత పడ్డాయని మండల తహశీల్దార్ ఏ.శ్రీనివాస్ అన్నారు.

ఇందుకు సంబంధించి పత్రిక ప్రకటనను మంగళవారం విడుదల చేశారు. సీతానగరం మండలంలోని మిర్తిపాడు గ్రామానికి చెందిన ఒక కోళ్ళ ఫారం యజమానికి చెందిన ఫారంలో 8 వేలు కోళ్లు మృతి చెందినట్లు చెప్పారు. జిల్లాలోని పెరవలి మండలంలో సైతం బర్డ్ ఫ్లు కారణంగా అనేక కోళ్ళు చనిపోయినట్లు పేర్కొన్నారు.

కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలు మేరకు మిర్తిపాడు గ్రామంలో సదరు కోళ్ల ఫారం ప్రాంతంలో 1 కిలోమీటరు పరిధిలోని ప్రాంతాన్ని రెడ్ జోన్ గా ప్రకటించినట్లు చెప్పారు. ప్రజా ఆరోగ్య పరిరక్షణ చర్యలలో భాగంగా మిర్తిపాడుతో పాటు సమీప గ్రామాల్లో ,మండలంలోని పలు గ్రామాల్లో చికెన్ అమ్మకాలు నిషేధించినట్లు చెప్పారు

.ప్రజలు సైతం కొన్నాళ్ళ పాటు కోళ్ల మాంసమును తినకుండా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని కోరారు. నిషేధ సమయంలో కోళ్ల మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రతికూల వాతావరణాన్ని తట్టుకునేలా మత్స్య సంపద ఉత్పత్తికి ప్రోత్సాహకం

ఎంపీ మహేష్

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : ప్రతికూల వాతావరణాన్ని తట్టుకునేలా మత్స్య సంపద ఉత్పత్తిని కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ మంత్రిత్వ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ తెలిపారు. గత ఐదేళ్లలో మత్స్య ఆధారిత వ్యాపారంపై వేడిగాలుల ప్రభావం వల్ల మత్స్య సంపదకు నష్టం వాటిల్లితే కేంద్ర

ప్రభుత్వం తీసుకున్న చర్యలపై ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖిత పూర్వకంగా మంగళవారం సమాధానం ఇచ్చారు. భారత ప్రభుత్వం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఆధ్వర్యంలోని మత్స్య పరిశోధనా సంస్థలు బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో సముద్రపు వేడిగాలుల లక్షణాలను అధ్యయనం చేస్తాయని, సముద్రపు ఉష్ణ తరంగాల కారణంగా సముద్ర పర్యావరణ వ్యవస్థ, మత్స్య ఆధారిత వ్యాపారంలో జరుగుతున్న సంక్లిష్ట పరిస్థితులపై మరింత అధ్యయనం చేయాల్సి ఉందని కేంద్ర మంత్రి బదులిచ్చారు.

పద్మశ్రీ ఘంటసాలకు ఘన నివాళి

విశాలాంధ్ర-ఏలూరు: సాహిత్య మండలి ప్రాంగణంలోని ఘంటసాల విగ్రహానికి వారి 51వ వర్ధంతి సందర్భంగా ఘంటసాల సంగీత కళాశాల

అధ్యక్షురాలు విష్ణువఝుల రేవతి పుష్పమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం జిల్లా రిజిస్ట్రార్ లంకా వెంకటేశ్వర్లు, వఝ్లకవి శ్రీనివాసరావు,పెదపాటి రామకృష్ణ,రామ్ కుమార్ ప్రభృతులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా రిజిస్ట్రార్ లంకా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజానికి మేలు చేసిన అనేక మందిలో ఘంటసాల ఒకరని వారు పాడిన పాటలు ఇప్పటికీ ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి ఉన్నాయని అన్నారు. అటువంటి మహనీయుల విగ్రహాలను ఆంధ్రప్రదేశ్‌లో ప్రతీ చోట జిల్లా, టౌన్, మండలం, గ్రామ గ్రామాన నెలకొల్పే కార్యక్రమాన్ని సాంస్కృతిక శాఖ చేపట్టాలని తెలియ జేశారు.

హేలాపురి కళా కారుల సంఘం అధ్యక్షులు పెదపాటి రామకృష్ణ మాట్లాడుతూ నాలుగు సంవత్స రముల క్రితం సాహిత్య మండలి ఆవరణలో ఘంటసాల విగ్రహం నెలకొల్పటం, ప్రతీ సంవత్సరం వారి జన్మ దినం, వర్ధంతి వేడుకలను, పురస్కరించుకుని నివాళి కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నందుకు సంస్థ కార్యదర్శి పుల్లాభొట్ల పురుషోత్తం ను కృతజ్ఞత లతో అభినందించారు. గాయకులు శ్రీహరి కోటి, ఆచారి, శ్రీనివాస్ ఘంటసాల మధుర గీతాలను పాడి వారి గానంతో నివాళి అర్పించారు. సాహిత్య మండలి ప్రధాన కార్యదర్శి పురుషోత్తమరావు, కార్యక్రమానికి విచ్చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సత్యనారాయణ, వెంకట్రావు, సత్యవాణి,విజయలక్ష్మి, అజయ్ కుమార్, విజయ్, మిల్టన్, నరసింహారావు ప్రముఖులు , అభిమానులు పాల్గొన్నారు.

ప్రశాంతం (1వ పేజీ తరువాయి)

మూతపడ్డాయి.ఈ కార్యక్రమంలో కుక్కునూరు గిరిజన సమాఖ్య అధ్యక్షులు వరసా పాపారావు,వరసా నాగేశ్వరరావు, పొట్ల లక్ష్మయ్య, కంగాల కళ్లయ్య, వరసా వెంకటేష్, కంగాల రామారావు, యర్రంశెట్టి నాగేంద్రరావు, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్ పోస్టులు భర్తీ చేయాలి

విశాలాంధ్ర-చింతలపూడి: ప్రభుత్వాసుపత్రిలో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులు భర్తీ చేయాలని సీపీఐ డిమాండ్ చేసింది. మంగళవారం సీపీఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే రోషన్ కుమార్‌కు సిపిఐ నాయకులు వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య మాట్లాడుతూ చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి చింతలపూడి మండల ప్రజలే కాకుండా సరిహద్దు జిల్లాలైన కృష్ణ, ఖమ్మం జిల్లాల నుంచి అనేకమంది ప్రజలు నిత్యం చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి ఓపి, ఇన్‌పేషెంట్లుగా వస్తుంటారని తెలిపారు. చింతలపూడి ప్రభుత్వాసుపత్రిలో 23 ప్రభుత్వ డాక్టర్ పోస్టులు ఉన్నాయని కానీ కేవలం 11 మంది డాక్టర్లు మాత్రమే పని చేస్తున్నారని తెలిపారు. మిగతా 12 పోస్టులను కూడా భర్తీ చేయాలని సిపిఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేసిన వినతి పత్రాన్ని స్థానిక శాసనసభ్యులు రోషన్ కుమార్‌కు అందజేసినట్లు తెలిపారు. తక్షణం ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి చింతలపూడి నియోజకవర్గ ప్రజలకు ప్రజా ఆరోగ్యం అందించాలనికోరారు. 100 పడకల ఆసుపత్రిని త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేసినట్లు గురవయ్య తెలిపారు. ఎమ్మెల్యేలను కలిసిన వారిలో మండల సహాయ కార్యదర్శి తొర్లపాటి బాబు, మండల కమిటీ సభ్యులు దొంత కృష్ణ, ఎస్.కె. కాలేషా, మల్ల గిరి అలెగ్జాండర్, రైతు సంఘం నాయకులు తక్కెలపాటి ప్రసాద్ రావు, తాడిగడప మాణిక్యాలరావు, తదితరులు ఉన్నారు.

మేజిక్ స్టార్ బోస్‌కు ఐబిఆర్ అచీవర్ అవార్డు

విశాలాంధ్ర -భీమవరం: ప్రఖ్యాత ఇంద్రజాలికుడు, రచయిత, మేజిక్ స్టార్ డాక్టర్ బోస్ ఆంగ్లంలో రచించిన 'ది రోల్ ఆఫ్ మేజిక్ అండ్ మెజిషియన్స్ ఇన్ ది ఎర్లీ మూవీస్' అనే పరి శోధనా గ్రంథానికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ఆయనను 'ఐబిఆర్ అచీవర్' అవార్డుకు ఎంపిక చేసి, దానిని ఆయనకు అందజేసింది.



ఆ గ్రంథాన్ని బోస్ 2023వ సంవత్సరంలో తానే ప్రచురించి, విశాఖపట్నంలో జరిగిన ఒక సభలో దానిని ఆవిష్కరింపజేసారు. బోస్ తన పుస్తకంలో మేజిక్, మెజీషియన్, మూవీ అనే పదాలను నిర్వచించి, వాటి పుట్టుపూర్వోత్తరాలను విపులీకరించారు. 140 సంవత్సరాల క్రితం ప్రారంభమైన చలన చిత్రాల రీతులను అధ్యయనం చేసి, వాటిని వివరించారు. తొలి నాటి సినిమాలలో ఇంద్రజాలం, ఇంద్రజాల ప్రదర్శనలు ప్రధాన పాత్రలు పోషించాయనీ, మెజీషియన్లే నాటి నిర్మాతలు, దర్శకులు, నటులుగా వ్యవహరించారనీ సోదాహరణంగా నిరూపించారు. ట్రిక్ ఫోటోగ్రఫీలనూ, ద్విపాత్రాభినయాలనూ ప్రవేశపెట్టింది కూడా వారేనని వెల్లడించారు. భారతీయ చలన చిత్ర పితామహుడు దాదా సాహెబ్ ఫాల్కే, ప్రఖ్యాత శాస్త్రవేత్త థామస్ అల్వా ఎడిసన్‌లు కూడా మేజిక్ కళలో ప్రవేశం కలిగినవారేనన్న సత్యాన్ని పరిశోధించి వెలికి తీసారు. బోస్ రచించిన ఆ గ్రంథం 'మేజిక్, సినిమా రంగాల అపూర్వ కలయికకు సంబంధించిన అత్యుత్తమ గ్రంథం' అని ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ఎడిటోరియల్ బోర్డు ప్రకటించింది.

అచ్యుత రామ సిద్ధాంతికి గౌరవ డాక్టరేట్

విశాలాంధ్ర - పాలకోడేరు : పాలకోడేరు మండలం గొల్లలకోడేరు కు చెందిన పురోహితులు దర్భా శివలింగమూర్తి కుమారుడు అచ్యుత రామ సిద్ధాంతి జ్యోతిష్య సంస్కృత ఋగ్వేద, యజుర్వేద విభాగాలలో చేసిన సేవలకు గాను ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ప్యారడైజ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు గౌరవ డాక్టరేట్‌ను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ అచ్యుతరామ సిద్ధాంతి మాట్లాడుతూ తనకు లభించిన ఈ గౌరవ డాక్టరేట్ తనకు సంతోషం ఇవ్వడమే కాకుండా తన బాధ్యత పెంచిందని అన్నారు. డాక్టరేట్ అవార్డును తన గురువు లకు, ధార్మికులకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. సులభమైన పద్ధతిలో జాతకాన్ని తెలియపరిచేలా వైదిక విభాగంలో రీసెర్చ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పురస్కారం అందిన సందర్భంగా ఆయన తల్లిదండ్రులు, మిత్రులు, డాక్టర్ లంక ప్రసన్నకుమార్, బ్రాహ్మణ సంఘం పెద్దలు, తదితరులు ఆయనను అభినందించారు.

కౌలు రైతుల సంక్షేమానికి సమగ్ర చట్టం తేవాలి

విశాలాంధ్ర-పెంటపాడు : భూ యజమానులు తమ కుటుంబ సభ్యులకు, తమ చెప్పుచేతలలో ఉన్న వారికి, బినామీ దారులకు గుర్తింపు కార్డులు ఇప్పించు కుంటున్నారని, ఇటువంటి పరిస్థితుల్లో వడ్డీ వ్యాపారస్తుల కనుసన్నల్లోనే కౌలు సేద్యం జరుగుతుందని సంఘం జిల్లా అధ్యక్షులు తాటిపాముల రాంబాబు పేర్కొన్నారు. రైతులు, కౌలు రైతుల సమస్యలపై మంగళవారం పెంటపాడు మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ ఏడిద కోట శ్రీనివాస్ కు రైతులు, కౌలు రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ రంగంలో చోటు చేసుకున్న మార్పుల నేపథ్యంలో కౌలు రైతులు గణనీయమైన సంఖ్యలో పంటలు పండిస్తున్నారని, కోస్తా ప్రాంతాల్లో 80 నుండి 90 శాతం, రాయలసీమలో 60 శాతం, ఉత్తరాంధ్రలో 70 శాతం కౌలు వ్యవసాయం కొనసాగుతుందని అన్నారు. పండించిన పంటలకు మద్దతు ధరలు దక్కకపోవడంతో సాగుభారాలు పెరిగి అప్పుల్లో కూరుకుపోయి తీర్చే మార్గం లేక కౌలు రైతులు అతి చిన్న వయసులోనే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆయన



ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఎనిమిది నెలల కాలంలో 97 మంది పైగా రైతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇందులో 70 నుంచి 80% కౌలు రైతులే ఉన్నారని ఆయన అన్నారు .వ్యవసాయ సంక్షోభం నుండి అన్నం పెట్టే అన్నదాతలైన రైతులను అన్ని రకాలుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వంకా అప్పారావు, ఉయ్యూరి సత్యనారాయణ, దిద్దే నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వీఆర్వోల ఆచూకీకి ప్రజల పాట్లు !

విశాలాంధ్ర - ముదినేపల్లి : గ్రామ రెవెన్యూ పాలనలో ముఖ్య భూమిక పోషించే వీఆర్వోలు స్థానికంగా అందు బాటులో ఉండడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొలువు ఒకచోట నెలవు మరోచోట ఇది జగమెరిగిన సత్యం. ముదినేపల్లి మండలంలో 32 రెవెన్యూ గ్రామాలు 45 శివారు గ్రామాలు గల పెద్ద మండలం. మండలంలో 19 మంది వీఆర్వోలు పనిచేస్తున్నారు. గతంలో ప్రతి గ్రామంలో వీఆర్వోలు తమ సొంత కార్యాలయాల వద్ద నివాసం ఏర్పాటు చేసుకుని ప్రజలకు అందుబాటులో ఉండే వారు. సచివాలయ వ్యవస్థ రావడంతో 19 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న వారు ముదినేపల్లి రెవెన్యూ కార్యాలయంలో భోజనాలు చేసి ఇక్కడే విశ్రాంతి తీసు కుంటున్నారన్న విమర్శలు సుస్పష్టం. ఆయా గ్రామాలలో పలువురు ప్రజలు వీఆర్వోలు తమకు అందుబాటులో ఉండక పోవడంతో గాలించి ముదినేపల్లి రెవెన్యూ కార్యాలయంలో కలుసుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో రెవెన్యూ యంత్రాంగం పనితీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వారిపై అజమాయిషి కొరవడిందని ఆరోపిస్తు న్నారు. గ్రామ రెవెన్యూ పాలన సక్రమంగా జరిగేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం అవగాహన సదస్సు

విశాలాంధ్ర-ఏలూరు: సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా 180 దేశాలు పాటిస్తున్నాయని నేషనల్ ఇన్ఫార్మెటిక్స్ సెంటర్ డిఐఓ భానుప్రకాష్ అన్నారు. మంగళవారం స్థానిక సర్.సిఆర్.రెడ్డి కళాశాలలో నేషనల్ ఇన్ఫార్మెటిక్స్ సెంటర్ డిఐఓ భానుప్రకాష్ ఆధ్వర్యంలో దినోత్సవ వేడుకలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో డిఐఓ భానుప్రకాష్ మాట్లాడుతూ ఫిబ్రవరి 11న ప్రపంచ వ్యాప్తంగా 180 దేశాలు సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవాన్ని పాటిస్తున్నాయని తెలిపారు. మెరుగైన ఇంటర్నెట్ కోసం డిజిటల్ వ్యక్తిగత డేటా పరిరక్షణకోసం 2025 ముసాయిదాను భారత ప్రభుత్వం జనవరిలో విడుదల చేసిందని తెలిపారు. దీని ద్వారా వ్యక్తిగత సమాచార గోప్యత పౌరుల ప్రాథమిక హక్కుగా గుర్తిస్తారని తెలిపారు. అభ్యంతర కర సమాచారం, చిత్రాలు, వీడియోలను ఇంటర్నెట్ ఆన్ లైన్ నుండి తొలగించమని కోరే హక్కును డిజిటల్ వ్యక్తిగత డేటా

పరిరక్షణ చట్టం 2023 సెక్షన్-12(3) కల్పిస్తుందని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకుండా ఇంటర్నెట్ ఎలా ఉపయోగించే అంశాలను తెలిపారు. కార్యక్రమంలో సర్.సి.ఆర్.ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కె. రామరాజు, కస్పాండెంట్ విష్ణుమోహన్, కో-ఆర్డినేటర్ ఎడిఐఓ సుజాత, కాలేజి విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పాతాళకుంట వాగు ప్రక్షాళన ఎప్పటికి?

విశాలాంధ్ర - లింగపాలెం: ధర్మాజీగూడెంలోని నివాసాల మధ్య మురికి కూపంగా ఉన్న పాతాళకుంట వాగును ప్రక్షాళన చేయకపోవడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వాగులో వ్యర్థాలు, మురికి నీరు నిలవ ఉండి దుర్గంధంగా మారింది. ఇప్పుడు బర్డ్ ఫ్లూ వైరస్ విజృంభిస్తుండటంతో పాతాళకుంట వాగు సమీప ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ వాగును ప్రక్షాళన చేయాలని గత నెల 21న విశాలాంధ్రలో ప్రచురించిన కథనానికి స్పందించిన సంబంధిత జిల్లా అధికారుల ప్రక్షాళన చేయిస్తామని హామీ ఇచ్చారు. హామీ ఇచ్చి 20 రోజులు అవుతున్నా వాగులోని మురికిని తొలగించే పనులు చేపట్టకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తుంది. గతంలో ఈ వాగు ప్రక్షాళనకు ఆర్‌డబ్ల్యుఎస్ నుంచి అనుమతులు వచ్చేవి. ఇప్పుడు ఈ శాఖ తమకు సంబంధం లేదని తెలపడంతో ఇరిగేషన్ శాఖ చర్యలు చేపట్టింది. దీన్ని ప్రక్షాళనకు అంచనాలు వేసి అనుమతులు ఇవ్వాల్సి ఉండగా ఈ పనులు జాప్యం అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాతాళకుంట వాగులోని వ్యర్థాలను, మురికి నీటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యక్తిత్వాన్ని తీర్చి దిద్దుకోవాలి

ఇస్రో రిటైర్డు సైంటిస్ట్ డాక్టర్ ఎ.రామలింగేశ్వరరావు

విశాలాంధ్ర -భీమవరం : స్వీయ క్రమశిక్షణతో, సానుకూల దృక్పథంతో వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోవాలని ఇస్రో రిటైర్డు సైంటిస్ట్ డాక్టర్ ఎ.రామలింగేశ్వర రావు అన్నారు. డిఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం వ్యక్తిత్వ వికాసం పై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసంలో సంస్కృతి, విలువలు, విశ్వాసాలు ప్రధాన పాత్ర వహిస్తాయని, ఆత్మ విశ్వాసంతో లక్ష్యాలు చేరుకోవాలన్నారు. మరో అతిథి ప్రముఖ రచయిత, మోటివేషనల్ ట్రైనర్ డాక్టర్ కలిదిండి సుబ్బరాజు మాట్లాడుతూ వ్యక్తిత్వం మలుచుకోవడానికి ఆత్మపరిశీలన ముఖ్యమని, బలం, బలహీనత గుర్తించి స్వీయ అవగాహనతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ గాదిరాజు బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అంజన్ కుమార్, యాంటీ ర్యాగింగ్ కమిటీ కోఆర్డినేటర్ డాక్టర్ జి.జి.రత్నం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-ఏలూరు: స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని యునాని వైద్యశాలలో జాతీయ యునాని డే సందర్భంగా మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు యునాని వైద్యాధికారి డాక్టర్ జి. రఘునాథ్ తెలిపారు.

కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ప్రాంతీయ ఉపసంచాలకులు డాక్టర్ కె. కల్యానకటాక్షం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యునాని వైద్యం ప్రాము ఖ్యతను వివరించారు. అనంతరం 65 మందికి వైద్య సేవలు అందించారు. కార్యక్రమానికి ముందు హకీమ్ అజ్మల్ ఖాన్ 157వ జన్మదినం సందర్భంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బుట్టాయిగూడెం వైద్యాధికారి డాక్టర్ జి. ప్రియదర్శిని, డాక్టర్ కె.ఎల్. సుభద్ర, డాక్టర్ కె. రాణి, వైద్య సిబ్బంది ఎం.కె. జమ, బ్రహ్మానందం, పెర్సిమణి, తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, Nadimpalli Suryanarayana Raju, S/o Subbaraju, R/o D No.7-117, Prakasam Veedhi, Pippara Village, Ganapavaram Mandalam, Eluru Dt, hereby change my name from **Nadimpalli Suryanaraya Raju to Nadimpalli Suryanarayana Raju.**

CHANGE OF NAME

I, Vegesna Venkata Subba Raju, S/o Varahala Raju, R/o D. No.1-69, Rajugari Veedhi, Godilanka Village, Allavaram Mandalam, Dr. B. R. Ambedkar Konaseema Dt, hereby change my name (surname) **Vegesana Venkata Subba Raju to Vegesna Venkata Subba Raju.**

పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించాలని డిఆర్పీ ఎం. మీనా కోరారు. బొర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మీనా

ఆధ్వర్యంలో మంగళవారం సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక తనిఖీల్లో భాగంగా ఉపాధ్యాయుల పనితీరు, పరిశుభ్రత, మౌలిక వసతుల కల్పన, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, విద్యార్థుల హాజరు శాతం రిజిస్టర్లు పరిశీలించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్‌కె మహమ్మద్ ఆలీ, ఎస్ఎంసి చైర్మన్ కె. రమేష్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో గిరిజనుల అభివృద్ధి శూన్యం

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం: గిరిజనుల అభివృద్ధికి వైసీపీ ప్రభుత్వం చేసింది శూన్యమని ఆంధ్రప్రదేశ్ ట్రైకార్ చైర్మన్ బోరగం శ్రీని వాసులు అన్నారు. మండలంలోని సింగన్నపల్లి కాలనీ వద్ద ఉన్న క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన

మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. 1/70 చట్ట సవరణపై అనేక దుష్ప్రచారాలు జరుగుతున్నాయని వాటిని నమ్మొద్దని, తమ నాయకుడు చంద్రబాబు నాయుడు గిరిజనుల అభివృద్ధికి, గిరిజన చట్టాల పరిరక్షణకు చిత్తశుద్ధితో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. జీవో నెంబర్ 3 ను సుప్రీంకోర్టు రద్దు చేస్తే దాని విషయంలో జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు.గిరిజనులకు మేలు చేకూరే విధంగా జీవో నెంబర్ 3 అమలుకు టిడిపి ప్రభుత్వం కృషి చేసిందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్.టి.సెల్ పోలవరం నియోజకవర్గం అధ్యక్షులు మడకం రామకృష్ణ, ఉపాధ్యక్షులు తెల్లం వెంకటేశ్వరరావు,పైదా వసంతరావు, వంకా సూరిబాబు,బడిశా ముత్యాలరావు, కుంజం శ్రీను, మానికల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శివారెడ్డికి సన్మానం

విశాలాంధ్ర-కాళ్ళ : మండల విద్యాశాఖలో 8 సంవత్సరాలు ఎంఐఎస్ కోఆర్డినేటర్గా పనిచేసి బదిలీపై గుంటూరు వెళుతున్న బండి శివారెడ్డిని పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. అంకిత భావంతో పనిచేసిన ఆయనను మండల శాఖ యూ టీఎఫ్ ఆధ్వర్యంలో

ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ పట్టాభిరామయ్య, జి. రామకృష్ణంరాజు, పి. రవికుమార్ రాజు బిఆర్ఎంకే స్వామి, పి ప్రభుదాసు, జి. కిషోర్ కుమార్,ఎం. ఎన్ సి హెచ్ ఎస్ వర్మ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన చట్టాలు పటిష్టంగా అమలు

విశాలాంధ్ర-జీలుగుమిల్లి: కూటమి ప్రభుత్వంలో 1/70 చట్టం పటిష్టంగా అమలు చేస్తున్నట్లు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. మంగళవారం బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం గిరిజన చట్టాలపై అసత్య ప్రచారం చేసి ఆదివాసి బందుకు పిలుపు ఇవ్వడం

తగదని అన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీ అయిన జీవో నెంబర్ 3ను పునరుద్ధరిస్తామని చెప్పారని పేర్కొన్నారు. గిరిజన చట్టాలపై అపార్థం చేసుకోవద్దని సూచించారు. ఆ చట్టాలపై కూటమి ప్రభుత్వం ప్రేమ, ఆప్యాయత ఉందన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవండి

ఆర్టీసీ డిఎం వాణి

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : ప్రజలను అత్యవసర, ప్రమాదకర పరిస్థితుల నుండి కాపాడేందుకు ప్రతి ఒక్కరు విధిగా రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఏపీఎస్ఆర్టీసీ ఏలూరు డిపో మేనేజర్ బి. వాణి పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం పట్ల ఉన్న అపోహలను విడనాడాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా మంగళవారం ఏలూరులో రక్తదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో సుమారు 60 మంది ఆర్టీసీ కార్మికులు రక్తదానం చేశారు. ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం డిపోల నుండి కార్మికులు వచ్చి స్వచ్ఛందంగా రక్తదాన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి మాట్లాడుతూ రక్త దనం చేయడం వల్ల మనిషిలోని హిమోగ్లోబిన్ మరింతగా వృద్ధిచెంది ఆరోగ్యవంతుడిగా జీవించడానికి దోహదపడుతుందన్నారు. అనేకమంది రక్తదానం చేయడం వల్ల ఎర్ర రక్త కణాలు వృద్ధి చెందవనే అపోహతో రక్తదానం చేసేందుకు వెనుకంజ వేస్తున్నారని చెప్పారు. రక్తదానం చేయడం వల్ల ముగ్గురికి ప్రాణదాతలుగా

మిగులుతారనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. రెడ్ క్రాస్ సొసైటీ తలసేమియా చిన్నారులకి రక్తదానం చేసి వారి జీవితంలో మరికొన్ని రోజులు బ్రతికించే అవకాశాన్ని కల్పించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ నుండి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్ఎస్ఆర్ కె. వర ప్రసాదరావు, పిఆర్ఓ కెవి.రమణ, ఆర్ఎం ఆఫీస్ సూపరిటెండెంట్ పి.వేణుగోపాలరావు, పిఆర్ఓ కేఎల్వి.నరసింహం, ఏఎంటి జి. మురళీ, ఎంఎఫ్ ఐ.ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల జీవన ప్రమాణాలు ముఖ్యం

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: దేశాభివృద్ధికి చమురు, గ్యాస్ ఉత్పత్తులను వెలికి తీయడం ఎంత ముఖ్యమో, స్థానిక ప్రజల జీవన ప్రమాణాలకు ఇబ్బంది లేకుండా కట్టుదిట్టమైన రక్షణ చర్యలు తీసుకోవడం అంతే ముఖ్యమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఓ ఎన్ జి సి ప్రతినిధులకు సూచించారు. ఓఎన్జిసి 20 బావుల త్రవ్వకాల ద్వారా చమురు, గ్యాస్ ఉత్పత్తి చేసేందుకు ప్రతిపాదించిన భీమవరం మండలం నాగిడి పాలెం, దెయ్యాలతిప్ప, నాగేంద్ర పురం గ్రామాల ప్రజలతో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ చేసి నివేదికను సమర్పించాల్సి ఉంది. ఈ సందర్భంగా మంగళవారం నాగిడి పాలెం తుఫాను పునరావాస కేంద్రం ఖాళీ ప్రదేశంలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాగిడిపాలెం, దెయ్యాల తిప్ప, నాగేంద్రపురం ప్రాంతాల అభివృద్ధికి

ఓఎన్జిసి సిఎస్ఆర్ ఫండ్స్ ద్వారా అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వారి సంక్షేమం చూడవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బోర్ వెల్స్ డ్రిల్లింగ్ చేసేటప్పుడు స్థానిక నివాసితులకు ముందస్తు సమాచారం అందజేయ మన్నారు. సమావేశంలో రాష్ట్ర కాలుష్య మండలి చీఫ్ ఇంజనీర్ పి.ప్రసాదరావు, పిసిబి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.వెంకటేశ్వరరావు, భీమవరం ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహసిల్దార్ రావి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఫార్మర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : వ్యవసాయ భూమి గల ప్రతి రైతు ఫార్మర్ పోర్టల్ లో రిజిస్టర్ చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి చెన్నకేశవులు పేర్కొన్నారు. మండలంలో వేదాంతపురం, రామనుజపురం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నకేశవులు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఫార్మర్ పోర్టల్ లో రిజిస్టర్ చేసుకున్న ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్య వస్తుందని, ఈ సంఖ్యకు అనేక రైతు పథకాలు అనుసంధానం చేయబడతాయని ఆయన పలు సూచనలను తెలిపారు.ఉద్యానవన శాఖ అధికారి దిరాజ్ లక్ష్మణ్ ఉద్యానవన పంటల గురించి, ఉద్యాన పంటలో యాజమాన్య పంటల గురించి రైతులకు సూచించారు.పశు వైద్య అధికారి బి.ఆర్ శ్రీనివాసన్ మాట్లాడుతూ ప్రస్తుతం కోళ్లకు

వచ్చే వ్యాధుల గురించి,పశువర్ధక శాఖలో అమలవుతున్న పథకాల గురించి రైతులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి రాజశేఖర్‌ను గెలిపించాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరా భత్తుల రాజశేఖర్ ను గెలిపించాలనిట్రైకార్ చైర్మన్ బోరగం శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల

ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా స్థానిక ప్రకాశం డిగ్రీ కళాశాలలో మండల, పట్టణ కూటమి పార్టీల ఆధ్వర్యంలో ప్రైవేటు ఉపాధ్యాయులకు, డిగ్రీ చదివిన పట్టభద్రులకు ఎన్నికల ప్రచార సమావేశాన్ని ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ కి పేరా బత్తుల రాజశేఖర్ పోటీ చేయనున్నారని ప్రతి ఒక్కరూ ఆయనకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్ పుప్పు విజయ్ కుమార్ మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాల్లో ఉన్న 34 నియోజకవర్గాలకు పట్టభద్రుల ఎమ్మెల్సీగా రాజశేఖర్ పోటీ చేస్తున్నారని తెలిపారు. పోలవరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పారేపల్లి రామారావు మాట్లాడుతూ సంక్షేమం కావాలంటే కూటమి పార్టీల ఆధ్వర్యంలో పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని అన్నారు. ప్రకాశం డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ వి. జనార్దన్ రావు మాట్లాడుతూ ప్రైవేట్ గ్రాడ్యుయేట్స్ కు భరోసా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గ పరిశీలకులు అనపర్తి వెంకటనారాయణ, టిడిపి మండల అధ్యక్షుడు పారేపల్లి నరేష్, జనసేన మండల అధ్యక్షుడు తోట వీర వెంకట సత్యనారాయణ, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

డీఎస్పీ జయసూర్య

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని భీమవరం డీఎస్పీ ఆర్. జయసూర్య అన్నారు. భీమవరం పురపాలక సంఘం, శ్రీసూర్య ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులతో మంగళవారం ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దుస్తుల షాపులు, కిరాణా దుకాణా లు, బేకరీ, కూరగాయల వ్యాపారులు తదితర వ్యాపారులు ప్లాస్టిక్‌ను నిషేధించాలని అన్నారు. కళాశాల కరస్పాండెంట్ నూకల గురునాయుడు, ప్రిన్సిపాల్ రూపా సూర్య లక్ష్మి, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంపై మార్పులు రావాలని, ప్లాస్టిక్ ఎక్కడికక్కడ వేయడం వల్ల మూగ జీవాలు ప్లాస్టిక్‌ను తిని మృతి చెందుతున్నాయని ఇది బాధాకరమన్నారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

కోర్టు కేసులు పరిష్కారం కావాలి

విశాలాంధ్ర-భీమవరం: భూ సంబంధిత కోర్టు కేసులు, తగదాలు త్వరితగతిన పరిష్కారం అయ్యేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులను జిల్లా జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ జాయింటు కలెక్టరు ఛాంబరులో జిల్లా రెవిన్యూ అధికారి, ఆర్డీవోలు, మండల తహశీల్దార్లు, సెక్షన్ సూపరింటెం డెంట్స్‌తో భూ సంబంధిత కోర్టు

కేసులు, భూ సంబంధిత తగదాలు పరిష్కారంపై గూగుల్ మీట్ జిల్లా జాయింటు కలెక్టరు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టరు మాట్లాడుతూ అమరావతి ఉన్నత న్యాయస్థానంలో పెండింగ్ ఉన్న భూ సంబంధిత కోర్టు కేసులు, భూ సంబంధిత తగదాలు, తదితర కేసులు త్వరితగతిన పరిష్కారం అయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. అన్ని పెండింగు కేసులపై కౌంటర్లను ఎప్పటికప్పుడు దాఖలు చేసి, కేసులు పరిష్కారంకు సమయస్ఫూర్తితో వ్యవహరించాలన్నారు. గూగుల్ మీట్ కార్యక్ర మంలో జిల్లా రెవిన్యూ అధికారి ఛాంబరు నుండి జిల్లా రెవిన్యూ అధికారి యం.వెంకటేశ్వర్లు, నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం ఆర్డీవోలు దాసిరాజు, కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఖతీబ్ కౌసర్ భాను వారి కార్యాలయం నుండి హాజరయ్యారు.

రక్తదాన శిబిరం విజయవంతం చేయండి

విశాలాంధ్ర - రాజానగరం : జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోని సంజీవని వాలంటరీ బ్లడ్ బ్యాంక్ నందు తమ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రతిఒక్కరూ విజయవంతం చెయ్యాలని శ్రీదుర్గా బ్లడ్ డోనార్స్ ఫౌండేషన్ ఛైర్మన్ జనపరెడ్డి దుర్గాప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా విశాలాంధ్రతో చరవాణిలో మంగళవారం ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బ్లాక్ డేగా పిలుచుకొనే ఫిబ్రవరి 14న ఉగ్రవాదులు ఆత్మాహుతి దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన భారతీయ సైనికులకు నివాళు లర్పించేందుకు తమ సంస్థ ఆధ్వర్యంలో సంజీవని వాలంటరీ బ్లడ్ బ్యాంక్ సారధ్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. రాజమహేంద్రవరంలోని స్థానిక గానుగువీధిలోని సంజీవని వాలంటరీ బ్లడ్ బ్యాంక్ నందు ఉదయం నుండి సాయంత్రం వరకు జరిగే రక్తదాన శిబిరానికి అధిక సంఖ్యలో యువత పాల్గొని విజయవంతం చేయ్యాలని కోరారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వ సేవలు

విశాలాంధ్ర - గోపాలపురం : ప్రజల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత సేవలు అందిస్తుందని గోపాలపురం సామాజిక ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చైతన్య రాజు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గుండె జబ్బులకు సంబంధించిన ఇంజక్షన్ టెనెక్ట్ ప్లస్ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. దీనిపై ఏఎన్ఎం మరియు ఆశ వర్కర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య రాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి లలో ప్రస్తుత ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందిస్తుందని అందులో భాగంగా గుండె పరిరక్షణకు అవసరమైన ఇంజక్షన్ టెనెక్ట్ ప్లస్ ఇంజక్షన్ అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఈ ఇంజక్షన్ ప్రైవేట్ ఆస్పత్రులలో అయితే రూ 50 వేలు ఖరీదు ఉంటుందని, కానీ ప్రభుత్వ ఆసుపత్రులలో పేదల మెరుగైన వైద్యం నిమిత్తం ఉచితంగా సరఫరా చేస్తుందని వివరించారు. గ్రామస్థాయిలో ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు ఇతర ప్రభుత్వ సిబ్బంది ప్రజలకు తెలియపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు భవ్య, దేవి శ్రీ ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపుతో ప్రభుత్వ ఫలాలు సులభతరం

విశాలాంధ్ర - రాజానగరం : విశిష్ట గుర్తింపుతో ప్రభుత్వ సంక్షేమ ఫలాలు మరింత సులభతరం అవుతాయని మండల వ్యవసాయ శాఖాధికారి ఎస్ కె ఇమామ్ ఖాసిం అన్నారు. సొంతభూమిగల ప్రతి రైతుకూ విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయించడం జరుగుతుం దన్నారు. దీనిలో భాగంగా విశాలాంధ్రతో మంగళవారం ఆయన చరవాణిలో మాట్లాడుతూ మండలంలోని సొంత భూములు ఉన్న ప్రతి రైతు తమ ఆధార్ నంబరు, ఆధార్ నంబరుకి అనుసంధానమైన ఫోన్ నంబరు, పట్టాదారు పాస్ పుస్తకం నకలు తీసుకొని వారి వారి గ్రామ రైతు సేవా కేంద్రం వద్ద త్వరితగతిన నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వీటి ద్వారా పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీపై సూక్ష్మ సేద్య పథకాలు, పంట రుణాలు, పెట్టుబడి సాయం తదితర పథకాలు నేరుగా పొందే వీలుంటుందని తెలిపారు.

ఒకరి రక్తదానం.. ముగ్గురికి ప్రాణదానం

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : ఆరోగ్యంగా ఉండే ఒకరు చేసే రక్తదానంతో ఆపాదలో ఉన్న ముగ్గురి ప్రాణాలు కాపాడవచ్చని తూర్పుగోదావరి జిల్లా ప్రజా రవాణా అధికారి అశోక శర్మిల అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోని ఏపీఎస్ఆర్టీసీ డిపో నందు రాజమహేంద్రవరం గవర్నమెంట్ హాస్పిటల్, కాకినాడ రెడ్ క్రాస్ సంయుక్తఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. రాజమహేంద్రవరం, గోకవరం, కొవ్వూరు, నిడదవోలు డిపోలకి సంబందించిన సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారన్నారు. శిబిరంలో మొత్తం 64 మంది రక్తదానం చేసినట్లు చెప్పారు. రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబానా మాట్లాడుతూ ఈ రక్తాన్ని శస్త్రచికిత్సల సమయంలో, గాయాలు, దీర్ఘకాలిక

వ్యాధుల చికిత్స కోసం రక్తం అవసరమైన వ్యక్తులకు వినియోగిస్తారన్నారు. దీనిలో భాగంగా డిపో ఐటీఆర్ఎస్ కాంట్రాక్టర్ ప్రసాద్ రక్తదాతలకు పండ్లు, శీతల పానీయాలు సమకూర్చారు. అనంతరం ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ మెడికల్ ఆఫీసర్ ప్రసునాంబ, రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, ఆర్టీసీ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేరాబత్తుల విజయానికి కృషి చేయండి

విశాలాంధ్ర - రాజానగరం : ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్డీఏ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి ప్రతిఒక్కరు శక్తివంచన లేకుండా కృషి చేయ్యాలని రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని దివాన్ చెరువు గ్రామంలోని శ్రీ ప్రకాష్ స్కూల్, విజిఎస్ ఫార్మసీ కళాశాల, జిల్లా ప్రజా పరిషత్తు పాఠశాల, ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో పట్టభద్రులను కలిసి ఎన్డీఏ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరిని కలుపుకొని పోయే మంచి వ్యక్తి రాజశేఖర్ అని, అందుకే ఆయనకు పోటీలో నిలబడేందుకు అవకాశం లభించిందని తెలిపారు. ఆయన వెంట ఎన్నికల అబ్జర్వర్ ఎంవివి ప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగిశెట్టి చంటిబాబు, తెలుగు

యువత జిల్లా అధ్యక్షులు కందుల బాబు రాయుడు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వంక మల్లిఖార్జున స్వామి (మల్లిబాబు), టీఎన్టీయూసీ జిల్లా అధికార ప్రతినిధి దాసరి శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి ఖండవల్లి లక్ష్మి, మాజీ ఎంపీపీ బచ్చు ప్రసాద్, సోషల్ మీడియా కన్వీనర్ సోడసాని త్రిమూర్తులు, పార్లమెంటు జెనరల్ సెక్రెటరీ డాక్టర్ అట్ల రాజేష్, నాయకులు పంచకట్ల నాగు,ముత్యం రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

జానకమ్మ నేత్రదానం

విశాలాంధ్ర - తాళ్ళరేవు : కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పోలేకుర్రు పంచాయతీ తోటపేట గ్రామానికి చెందిన పూడ జానకమ్మ మంగళవారం స్వర్గస్తులైనారు, సామాజిక కార్యకర్త లయన్ ధూళిపూడి వెంకటరమణ (బాబి) వాళ్ళ కుమారుడు ప్రసన్నకు నేత్రదానంపై అవగాహన కల్పించి తన తల్లి కార్నియాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు అందజేశారు. ఐ బ్యాంక్ సిబ్బంది నానాజీ, నాని కార్నియాలను సేకరించారు. ఇంతటి విషాద

సమయంలో కుటుంబ సభ్యులు తీసుకున్న మంచి నిర్ణయంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కార్నియల్ అంధత్వంతో బాధపడుతున్న ఇద్దరు జీవితాల్లో వెలుగులు నింపిన ధన్యజీవి జానకమ్మ అని ధూళిపూడి బాబి అన్నారు. కుటుంబ సభ్యులను దున్నా మహేంద్ర, వెంకటరమణ, గోవరాజు, నిమ్మకాయల మూర్తి, తదితరులు పరామర్శించారు.

ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేసుకోవాలి: ఏవో

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలోని సొంత భూములు కలిగిన ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేసుకోవాలనీ మండల వ్యవసాయ శాఖాధికారి కె.సూర్య రమేష్ అన్నారు. మండలం లోని రాపాక, పురుషోత్తపట్నం గ్రామాలలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.సూర్య రమేష్ మాట్లాడుతూ భూమిగల ప్రతి రైతుకూ విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయించడం ద్వారా వ్యవసాయ సేవలు సులభతరమవుతాయన్నారు. తద్వారా పీఎం కిసాన్ చెల్లింపు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ,

రాయితీపై సూక్ష్మ సేద్య పథకాలు, పంట రుణాలు, పెట్టుబడి సాయం తదితర పథకాలు నేరుగా పొందే వీలుంటుందన్నారు. ఇందుకు సంబంధించి రైతులు తమ ఆధార్ నంబరు, ఆధార్ నంబరుతో అనుసంధానమైన ఫోన్ నంబరు, భూమి రికార్డు(పట్టాదారు పాసు బుక్) నకలు తీసుకొని ఆయా గ్రామ రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలనీ తెలిపారు.

దివ్యాంగుల సర్వే కమిటీ నియామకం

విశాలాంధ్ర - రాజోలు : మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఇంటింటా దివ్యాంగుల సర్వే నిర్వహించేందుకు వైద్యులు, న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లు, స్త్రీ,శిశు సంక్షేమ శాఖలతో ఒక కమిటీ నియామకం చేపట్టినట్లు మండల లీగల్ సెల్ కమిటీ చైర్మన్ ప్రమీల రాణి తెలిపారు. మంగళవారం సర్వేకు సంబంధించి కోర్టు ప్రాంగణంలో కమిటీ సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి, మామిడికుదురు మండలాల్లో ఉన్న గ్రామాల్లో ఇంటింటా సర్వే చేపట్టి శారీరక, మానసిక వికలాంగుల వివరాలు సేకరించి వారికి విద్య, వైద్య సదుపాయాలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా తెలుసుకోవా లన్నారు. అవసరమైతే సంబంధిత అధికారులతో మాట్లాడి వారికి సదరమ్ సర్టిఫికెట్లు, పెన్షన్ మంజూరు అయ్యేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది జి .రజిత, ఐసీడీఎస్ సీడీపీఓ రమాదేవి, వైద్యాధికారి మణి కుమార్, ఫణి కిరణ్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ క్రాంతి కుమారి, పారాలీగల్ వాలంటీర్లు మహాలక్ష్మి, సురేంద్ర కుమార్, ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వస్తువుల వితరణ

విశాలాంధ్ర - ఏలేశ్వరం : పట్టణానికి చెందిన మార్స్ కంప్యూటర్స్ అధినేత అడపా దుర్గారావు మాతృమూర్తి 8వ వర్ధంతి పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు మంగళవారం చేపట్టారు. ఈ మేరకు దుర్గారావు తల్లి జ్ఞాపకార్థం పట్టణంలో బాలికలు, బాలల వసతి గృహంలో విద్యార్థులకు చాపలు పంపిణీ చేశారు. అనంతరం లింగంపర్తి గ్రామానికి చెందిన విశ్వహిందూ పరిషత్ ప్రచారకర్త వీర భద్రరావు, అప్పలరాజు దంపతుల కుటుంబానికి 25కేజీల బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోరాడ రాజు, హాస్టల్ వార్డెన్లు సిద్ధాంతపు సూకరాజు, పోతుబంది దేవతయ్య, ఉడతల రమణారావు తదితరులు పాల్గొన్నారు.

Public Notice

Known to all that applicant **Peddireddy Nagalakshmi, W/o.Maddipati Uday Ramakrishna and Co-Applicants Maddipati Uday Ramakrishna, S/o M.Sattiraju** have been sanctioned a Housing Loan by Repco Home Finance Ltd., for Purchase of House - Resale

West Godavari District, Kovvur Mandal, Kovvur Sub – Registrar's Office Limits, Kovvur Municipal Area, Kovvur Village, Old 16th Ward Presnt 13th Ward, Door No.12-11-4 R.C.C. Daba house, Door No.12-10-11 Thatched House, with an extent of 126 3/4 Square yards in it South Side an extent of 82 1/2 Square yards site and therein Door No.12-11-4,Assessment No.1076001245 RCC Daba house site boundaries (As per the Survey Certificate the Rs.No.679-3): East : 33-9 Ft: House Site of Md. Liyakat Ali, Md.R.B. Meera Mohiddien, South : 21-8 Ft. Raja Veedhi, West : 33-9 Ft. Ouse of Devara Satyanarayana& others, North : 22-5 Ft. Compound Wall of the Executants.

Within the above boundaries, Consisting Site an extent of 82 1/2Square yards or 6/-980 Square meters Site and therein above said number daba house together wit Doors, Doorways, Windows, Cup Boards,ceiling, Current Service **No.4734,4735,** and general ways, passageways, drainage ways and with all usual easement Rigts. is in favor of Goduguluri Ramu, and the same to mortgaged by in favour of Repco Home Finance ltd., Rajahmundry Branch to avail Housing loan for Purchase of House - Resale of **Rs.15,00,000/-** anybody having interest or claims over the property shall intimate to us with in 7 days from the date of this publication inwriting.

Kartha Jagadeesh Kumar, Advocate
Office : D No.12-3-32/1A, Besides Road of Narayana Shool,Aryapuram, Rajamahendravaram-533104

పారిశుధ్య పనుల తనిఖీ

విశాలాంధ్ర - కాకినాడ : ప్రజాసమస్యల పరిష్కారంలో భాగంగా కాకినాడ నగరపాలక కమిషనర్ భావన ఐఏఎస్ సోమవారం పలు ప్రాంతాల్లో పర్యటించారు. దీనిలో భాగంగా కరణం సెంటర్, కమల్ వీర్ థియేటర్ పరిసర ప్రాంతాలు, స్టేడియం రోడ్డు, ఎల్విన్‌గర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనుల నిర్వహణ తనిఖీ చేశారు. రోడ్లు, డ్రెయిన్ల పరిశుభ్రత, ఇంటింటా చెత్త సేకరణ ఎలా జరుగుతోందనే విషయాలపై ఆరా తీశారు. పారిశుధ్య సిబ్బందికి అనేక సూచనలు చేశారు. ఈ పర్యటనలో కమిషనర్ వెంట అదనపు కమిషనర్ కెటి సుధాకర్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మీతోనే ఉంటా : ముద్రగడ

విశాలాంధ్ర - జగ్గంపేట, కిర్లంపూడి : మాజీ మంత్రి, వైసీపీ నేత ముద్రగడ పద్మనాభరెడ్డి నాయకులకు, అభిమానులకు లేఖ రాశారు. ఈ మధ్య నా ఇంటిపై జరిగిన దాడి సందర్భంగా కులాలకు, మతాలకు, వర్గాలకు, పార్టీలకు అతీతంగా నా ఇంటికి వచ్చి మీ మద్దతు తెలియజేసినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నా నన్నారు. మా నాయకులు జగన్మోహన‌రెడ్డి ఫోన్లో పలకరించి నందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నా నన్నారు. నా ఇంటిపై జరిగిన దాడి లాంటిది మీ మీద జరగకూడదని భగవంతున్ని కోరుతున్నానని లేఖలో పేర్కొన్నారు. దాడి సమాచారాన్ని తెలియజేసిన వెంటనే స్పందించినందుకు పోలీసు వారికి నా కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. మీ మంచి చెడుల లో నేను మీతో ఉంటాను అని లేఖలో వ్రాశారు.

ఈ-శ్రమ్‌తో బహుళ ప్రయోజనాలు

విశాలాంధ్ర - ఆలమూరు : అసంఘటిత రంగాల కార్మికులకు సామాజిక భద్రత కల్పించడం తో పాటు ప్రభుత్వ ఉపాధి పథకాలను చేరువ చేసేందుకు కేంద్రం తీసుకొచ్చిన పథకం ఈ-శ్రమ్. ఇందులో నమోదు చేసుకుంటే అనేక ప్రయోజనాలు ఉంటాయని మండపేట సహాయ కార్మిక అధికారి కాశీ నాగమల్లేశ్వరరావు సూచించారు. ఆలమూరులో మంగళవారం అనేక ఇటుకబట్టీలను పరిశీలించి అక్కడ పనిచేస్తున్న కార్మికులతో ఆయన మాట్లాడారు. అనంతరం బట్టీల వద్ద రికార్డులను పరిశీలించారు. రికార్డులలో ఉన్న లోపాలను సవరించుకోవాలని యజమానులకు ఆయన సూచించారు. ఎవరూ చదువుకునే పిల్లలను పనిలో పెట్టుకోవద్దని తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందని అయితే అవగాహన లేక కార్మికులు ప్రయోజనాలు పొందం డంలో విఫలమవుతున్నారన్నారు. కార్మికులు యజ మానులు ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవాలన్నారు.

శభాష్ పోలీసు..

విశాలాంధ్ర - అమలాపురం : చుట్టూ చీకటి..అర్ధరాత్రి 11.21 అతి తక్కువ సమయం..రెండు జిల్లాల దూరం...కాపాడాల్సిన ఒక నిండు ప్రాణం...ముగ్గురు పోలీసులు ఒక్కటైన తరుణం. ఆపై విజయం. 6 నిమిషాల్లో కోనసీమ జిల్లా అయినవిల్లి నుంచి కాకినాడ జిల్లా అన్నవరం 'వీడియో పెట్టి ఆత్మహత్య చేసుకుందామనుకున్న వ్యక్తిని 6 నిమిషాల్లో కాపాడిన పోలీసులు అందరి అభినందనలు అందుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన యువకుడు సెల్ఫీ వీడియో పెట్టి చనిపోయేందుకు సిద్ధమయ్యాడు. వివరాల్లోకి వెళితే కోనసీమ జిల్లా అయినవిల్లి మండలంకు చెందిన వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో చనిపోదామని నిర్ణయించుకున్నాడు. ఆ తర్వాత తనకు కావలసిన బంధువులకి సెల్ఫీ వీడియో పెట్టి ఉరి వేసుకుని చనిపోదామని నిర్ణయించుకున్న సమయంలో పి గన్నవరం సీఐ ఆర్ భీమరాజుకు వచ్చిన సమాచారం మేరకు వెంటనే ఆయన ఫోన్ నెంబర్‌ని ట్రేస్ చేయడం కోసం ఐటీ కోర్‌లో పనిచేస్తున్న జాఫర్‌కు పంపించడం జరిగింది. వెంటనే స్విచ్ ఆఫ్‌లో ఉన్న మొబైల్‌ను క్రెడియన్షియల్స్ ఉపయోగించి సెల్ ఐడితో లాస్ట్ లొకేషన్‌ను కనుగొన్న జాఫర్ వెంటనే ఆ లొకేషన్‌ను సీఐ భీమరాజుకు షేర్ చేయడం జరిగింది. వెంటనే ఆ లొకేషన్ చూసిన సీఐ భీమరాజు కాకినాడ

జిల్లా అన్నవరంలో లొకేషన్ రావడంతో వెంటనే అన్నవరం ఎస్సై శ్రీహరిని లైన్‌లోకి తీసుకోవడం జరిగింది. అన్నవరం ఎస్ఐ శ్రీహరి వెంటనే వాళ్ళ సిబ్బందిని ఆ లొకేషన్‌కి పంపించడంతోపాటు ఆ వీడియో వెనకాల ఉన్న రూమ్ లాడ్జి రూమ్ లాగా అనిపించడంతో అన్నవరంలో ఉన్న లాడ్జి ఓనర్స్ గ్రూపులో దాన్ని షేర్ చేసి వాళ్ళందర్నీ అలెర్ట్ చేయడం జరిగింది. వెంటనే ఒక లాడ్జి యజమాని అతడిని గుర్తించి సరిగ్గా ఉరివేసుకొని సమయంలో తలుపు బద్దలు కొట్టి అతన్ని కాపాడడం జరిగింది. ఈ మొత్తం వ్యవహారం అంతా రాత్రి 11:21 నుంచి 11:27 మధ్యలో కేవలం ఆరు (6) నిమిషాల వ్యవధిలోనే జరగడంతో ఒక నిండు ప్రాణాన్ని కాపాడడం జరిగింది. ఈ ప్రయత్నంలో విజయం సాధించి ఆ వ్యక్తిని కాపాడిన సీఐ భీమరాజుకి, అన్నవరం ఎస్ఐ శ్రీహరికి, ఐటీ కోర్ కానిస్టేబుల్ జాఫర్‌కి గ్రామస్తులు, సెటిజెన్స్ ధన్యవాదాలు తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించండి

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం పురపాలక సంఘం క్లాప్ డ్రైవర్స్ ఆటో-టిప్పర్ (తడి చెత్త-పొడి చెత్త సేకరించే) వాహనాల డ్రైవర్స్ నిరసన తెలిపారు. క్లాప్ డ్రైవర్స్ అండ్ లోడర్లు 15 సచివాలయాల పరిధిలో 30 వార్డుల్లో వీరు పండుగ అనక, పబ్బం అనేక ప్రతినిత్యం పారిశుధ్య సేవలు అందించే మాకు మా కాంట్రాక్టరు డిసెంబర్, జనవరి, నెలలు జీతాలు చెల్లించలేదు. ఫిబ్రవరి నెల సగం రోజులు గడిచాయి. కావున 3 నెలలు వేతనం మార్చి 5వ తేదీకి చెల్లించాలని కమీషనర్‌రు కోరారు. నెలవారీ వేతనం చెల్లింపులు 5న ఖచ్చితంగా చెల్లించాలని లేని యెడల 6 నుంచి వడ్డీతో కలిపి చెల్లించాలని. మౌలిక వసతులు కల్పించాలని, గత ప్రభుత్వం తీసుకొచ్చిన చెత్త సేకరణ కొరకు చెత్త పన్ను ద్వారా ఈ వాహనాలను నడిపే చెత్త విధానం రద్దు చేసిన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ క్లాప్ డ్రైవర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరారు. జిల్లా కన్వీనర్ కుంచె అరుణ్ కుమార్, జిల్లా కో కన్వీనర్ యనమదల మురళీ కృష్ణ, ఏపీ మున్సిపల్ క్లాప్ డ్రైవర్స్ యూనియన్ ఎఐటీయూసీ అనుబంధ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఏబీసీ వర్గీకరణతో మాదిగలకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర- కొవ్వూరు : గురువారం మంగళగిరి మాదిగ కార్పొరేషన్ ఆఫీసులో జరిగిన తెలుగుదేశం పార్టీ అధికారప్రతినిధిగా కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఎస్సీ వర్గీకరణపై మాదిగల తరుపున ఆయన అభిప్రాయాన్ని తెలియచేస్తూ మెమోరాండం వేమగిరి వెంకట్రావు ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమీషన్ రాజీవ్ రంజన్ మిశ్ర రిటైర్డ్ ఐఏఎస్ కమీషనర్‌కు దరఖాస్తు ఇవ్వటం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వేమగిరి వెంకట్రావు మాట్లాడుతూ మాదిగల మనోభావాలు తెలియచేస్తూ మాల, మాదిగలు కులగణనలో తప్పులు ఉన్నాయని కుల గణనను రీ సర్వే చేయాలని కమిషనర్‌ని కోరటం జరిగిందన్నారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించటం జరిగిందని ఆయన తెలిపారు.

నేటి నుంచి శివ కేశవుల ప్రతిష్ఠ పూజలు

విశాలాంధ్ర - జగ్గంపేట : మండలంలోని ఇర్రిపాకలో ఏలేరు కాలువ తీరాన ప్రతిష్ఠిస్తున్న శివ కేశవుల పూజ కార్యక్రమాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. నేటి నుండి 17 వరకు శివ కేశవుల ప్రతిష్ఠ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ ఏర్పాట్లను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం ఇర్రిపాకలో మాట్లాడుతూ బుధవారం ఉదయం కాతేరు నుండి భజన బృందాలు, మేళ తాళాలతో ఊరేగింపుగా దివాన్ చెరువు, మురారి, గండేపల్లి, మల్లేపల్లి, జగ్గంపేట మీదుగా ఇర్రిపాకకు విగ్రహాలు చేరుకుంటాయన్నారు. ఈనెల 17న 11:55 నిమిషాలకు శివ కేశవుల విగ్రహ ప్రతిష్ఠ ఏలేరు కాలువలో కోటి పార్థివ శివలింగాలను నిక్షిప్తం చేసిన ప్రదేశంలో జరుగుతుందన్నారు. ఇక్కడకు వచ్చే భక్తులకు భోజన ప్రసాదం, తీర్థ ప్రసాదాలు, ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని రకాల సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరపుల సుబ్బారావు, టిడిపి నాయకులు మారిశెట్టి భద్రం, చదరం చంటిబాబు, బ్రహ్మకుమారీలు, అన్నం దేవుల చంటి, భూపాలపట్నం ప్రసాద్, మారిశెట్టి రాధా, యర్ర బత్తుల గోవింద నాయుడు, బస్వా చినబాబు, బోడిరెడ్ల సుబ్బారావు బద్ది సురేష్, కాళ్ల వెంకటేష్ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు అన్న సమారాధన

విశాలాంధ్ర - కాట్రేనికోన : దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీ కుండలేశ్వర స్వామి ఆలయం వద్ద బుధవారం అఖండఅన్న సమారాధన ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక ఎంపీటీసీ అక్కల శ్రీధర్ తెలిపారు. శ్రీ పార్వతి సమేత కుండలేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాల సందర్భంగా ప్రతి ఏటా అఖండ అన్న సమారాధన ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ అఖండ అన్న సమారాధన కార్యక్రమంలో అందరు పాల్గొనాలని తీర్థ ప్రసాదములు స్వీకరించాలని శ్రీధర్ కోరారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం

విశాలాంధ్ర - రావులపాలెం : రావులపాలెం గ్రామ పరిధిలోని జొన్నాడ రావులపాలెం బ్రిడ్జి కింద గౌతమీ గోదావరి నదిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉన్నట్లు స్థానిక వీఆర్వోకి సమాచారం అందింది. ఈ విషయమై వీఆర్వో ఇచ్చిన రిపోర్ట్‌పై రావులపాలెం పోలీస్ స్టేషన్ ఎస్ఐ చంటి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రిలో మార్చురీ షెడ్‌లో ఉంచారు. మృతురాలి వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు 5 అడుగుల 4 అంగుళాల పొడవు, 6 అంగుళాల జుట్టు, నీలిరంగు చీర, జాకెట్ ధరించి ఉంది. మృతదేహం పూర్తిగా కమిలిపోయి, చర్మం ఊడిపోయిన స్థితిలో ఉంది. దురదృష్టవశాత్తు నదిలో జారిపడి ఇక్కడికి కొట్టుకొచ్చి ఉండవచ్చని అనుమానం వ్యక్తమవుతోంది. ఈమె గురించి ఎవరైనా సమాచారం తెలిసిన వారు రావులపాలెం సీఐ 9440796567, ఎస్ఐ 8712689529ను సంప్రదించ వలసిందిగా పోలీసులు కోరుతున్నారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

విశాలాంధ్ర - జగ్గంపేట : మండల కేంద్రమైన జగ్గంపేట పాత పోలీస్ స్టేషన్ వద్ద మంగళవారం నిర్వహించిన డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం చేశారు. జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్, తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ ఉచిత క్యాంటీన్ నిర్వహించి జన సైనికులతో కలిసి పేదలకు అన్నం వడ్డించారు. ఈ కార్యక్రమంలో రాజనాల శ్రీను, సూరపురెడ్డి నరేష్, మాదారపు వీరబాబు, గోన శివ, అడబాల వీరబాబు, కె కనకరాజు, మల్లేపలి గణేష్, కొలమూరి భద్రరావు, రేపూరి శ్రీను, బచ్చల రాజు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

విశాలాంధ్ర - కాట్రేనికోన : కాట్రేనికోనలో వేంచేసి ఉన్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణు గోపాల స్వామి ఆలయం వద్ద నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠా పన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. మంగళ వాయిద్యాలు మధ్య వేద పండితులు, పురోహితులు మంత్రోచ్ఛారణలతో ధ్వజ స్తంభం ప్రతిష్ఠ ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా అన్నదాన ప్రసాద వితరణ జరిగింది. భారీ క్రెయిన్ ఉపయోగించి ధ్వజస్తంభాన్ని నిలబెట్టారు. పోలీసులు ఆర్ అండ్ బి రోడ్డుపై ఆంజనేయస్వామి సెంటర్ నుండి రాజుల వీధి మీదుగా కాట్రేనికోన గేటు సెంటర్‌కు ట్రాఫిక్‌ను మళ్ళించారు.

పేరాబత్తులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - అనపర్తి : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకి మొదటి ప్రాధాన్యత (1)ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోరారు. మంగళవారం రామవరంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల ఇంటింటికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నియోజవర్గ ఎమ్మెల్యే చింతల రామకృష్ణ వెళ్లి రాజశేఖరంకి మొదటి ప్రాధాన్యత గ్రాడ్యుయేట్ ఓటు వేసి గెలిపించాలంటూ కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు శ్రీను), కూటమి నేతలు నల్లమిల్లి సుబ్బారెడ్డి, కర్రి చిన్నారెడ్డి, ఎం ఎస్ ఆర్ కె రాజు, జుత్తుక సూర్య కుమారి, రావాడ నాగు, ఎన్ డి ఏ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి గెలుపునకు కృషి చేయండి

విశాలాంధ్ర - కడియం : ఎన్డీఏ కూటమి బలపరిచిన ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టిడిపి ఆరోగ్య విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవి రామ్ కిరణ్ అన్నారు. మండల కేంద్రమైన కడియం గ్రామం వెలుగుబంటి వారి కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ గోరంట్ల రవి రామ్ కిరణ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలు సాధారణ ఎన్నికల కంటే కొంచెం భిన్నంగా ఉంటాయన్నారు. ప్రతి గ్రామంలోనూ గ్రాడ్యుయేట్స్‌ని గుర్తించి, పోలింగ్ రోజున ఓటు వేసే విధంగా చేయవలసిన బాధ్యత కూటమి కార్యకర్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి కడప జిల్లా పూలవెందుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్ గోపాల్ రెడ్డి, పరిశీలకులు ఎం తేజోవతి, డి నాథ్ బాబు హాజరయ్యారు. స్థానిక ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, కూటమి నాయకులు వెలుగుబంటి నాని, ముద్రగడ జెమ్మి, గట్టి సుబ్బారావు, బొరుసు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గర్భిణులు మానసిక ఒత్తిడికి గురికావొద్దు : డాక్టర్ చప్పిడి

విశాలాంధ్ర - కాకినాడ : గర్భిణీ స్త్రీలు మానసిక ఒత్తిడికి గురికారాదని సమతుల్యమైన ఆహారం తీసుకుని చిన్నపాటి వ్యాయామాలు చేయాలని అలియన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్ పర్సన్, రాష్ట్ర శెట్టిబలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కరప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పద్మారం అలయన్స్ క్లబ్ అధ్యక్షులు పెంకేసేవ కోశాధికారి వీరభద్రరావు ఆధ్వర్యంలో ప్రతినెల గర్భిణులకు పండ్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథిగా అలయన్స్ క్లబ్ గవర్నర్ అల్లైవనం శ్రీనివాసరావు హాజరై క్రమం తప్పకుండా గర్భిణీ స్త్రీలు డాక్టర్ని సంప్రదించి వారి సూచనల మేరకు పలు జాగ్రత్తలు తీసుకొని మంచి ఆహారాన్ని కూడా తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ చప్పిడి మాట్లాడుతూ ఈనెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో మంచివాడు మృదుస్వభావి పేరా బత్తుల రాజశేఖర్ పోటీ చేయుచున్నారు. కావున ఓటు ఉన్న పట్టబదులందరూ వారిని సమర్థించి ఒకటో నెంబర్ ప్రాధాన్యత ఓటును చేయాలని కోరారు. కార్యక్రమంలో నులుకుర్తి వెంకటేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు దేవు వెంకన్న, మండల మహిళా అధ్యక్షులు వెంకటలక్ష్మి, జనసేన మండల అధ్యక్షులు బండారు మురళి, ముద్రగడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు దేశానికి వెన్నుముక : వెంకటరెడ్డి

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం రైతు దేశానికి వెన్నుముక అని కపిలేశ్వరపురం మండలం కేదార్లంక గ్రామ సర్పంచ్ వీధి వెంకటరెడ్డి అన్నారు. తాడేపల్లిగూడెం డాక్టర్ వైయస్ఆర్ వ్యవసాయ యూనివర్సిటీ విద్యార్థులు కపిలేశ్వరపురం మండలం కేదార్లంక గ్రామంలో నాలుగు నెలలుగా క్షేత్ర స్థాయిలో ఉద్యవన పంటలుపై శిక్షణ పొందారు. వ్యవసాయ విద్యార్థుల శిక్షణ పూర్తి అయిన సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వీధి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన సత్కార సభ నిర్వహించారు. ఈ సత్కార సభలో వీది వెంకట రెడ్డి మాట్లాడుతూ సమాజానికి ఆహారం అందించే అన్నదాతలకు అధిక ఉత్పత్తులు సాధించేలా తమ విజ్ఞానాన్ని అందించాలి కోరారు. ఆదునిక యంత్రాల ఉపయోగించి కూలీల కొరతను అధిగమించేందుకు కావలసిన పరిజ్ఞానాన్ని రైతులకు వ్యవసాయ విద్యార్థులు అందించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులకు మెమెంటోలు అందచేశారు. వీరి శిక్షణకు తోడ్పడిన అంబోజి పేట కొబ్బరి పరిశోధన శాస్త్ర వేత్తలు నిరజ, కోటేశ్వరరావు, విశ్వనాథ్‌లను శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీటీసీ యర్రంశెట్టి నాగేశ్వరరావు, పోలిశెట్టి గణేష్, వీది ప్రసాద్, సాదా రవిభాస్కర్ రావు, రంకిరెడ్డి వెంకటేశ్వర రావు, వీది గంగాధర్, సాదా ధన రాజ్, మారిశెట్టి చంటి, యర్రంశెట్టి కామ రాజు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

విశాలాంధ్ర - ఆలమూరు : ఉభయ గోదావరి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించుకోవడం ద్వారా యువతకు భరోసా ఏర్పడుతుందని కొత్తపేట జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ఆలమూరు శ్రీకృష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపంలో మంగళవారం జరిగిన మండల స్థాయి జనసేన కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్కొక్క సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు ప్రజల ఆదరాభిమానాలను విశేషంగా పొందుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు. గ్రాడ్యుయేట్ల సమస్యలను, యువత ఆశలను శాసనమండలిలో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం వినిపిస్తారని బండారు శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. కూటమి నాయకులు ఏ విధమైన భేదాభిప్రాయాలు ప్రదర్శించకుండా ఒకరినొకరు సమన్వయం చేసుకుంటూ ప్రతి గ్రామంలోనూ ఉన్న గ్రాడ్యుయేట్ ఓటర్లను కలుసుకొని, వారితో మాట్లాడి, కూటమి అభ్యర్థికి ఓట్లు పడేలాగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సూరపరెడ్డి సత్య, సలాది జయప్రకాష్ నారాయణ, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, నల్లా వెంకన్న, తోట వెంకటేశ్వరరావు, గారపాటి శ్రీనివాస్ చౌదరి, గారపాటి త్రిమూర్తులు, కొత్తపల్లి నగేష్, పడాల అమ్మిరాజు, గుత్తుల నాగేశ్వరరావు, సిరిగినేడి పట్టాభి, చల్లా బాబి, చల్లా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అంగర నందు వైద్యాధికారి పిఎస్ఎస్ డి రత్నకుమారి ఆధ్వర్యంలో 25 మంది గర్భిణీలను పరీక్షించి, మందులను అందజేశారు. ఇద్దరిని క్లిష్టతర గర్భిణీలుగా గుర్తించి, సిహెచ్‌సీ కపిలేశ్వరపురంనకు రిఫరల్ చేశారు. డాక్టర్ రత్నకుమారి మాట్లాడుతూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలను చేయించు కోవడం, పోషకాహారం తీసుకోవడం వల్ల సురక్షిత ప్రసవానికి, తల్లి బిడ్డ క్షేమకర స్థితికి కారణం కాగలదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ ఈఓ -జె మల్లికార్జునుడు మరియు హెల్త్ ఎడ్యుకేటర్ బి రామారావు సంయుక్తంగా మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా అందించు తున్నటు వంటి ఆర్థిక లబ్ధి అనగా ఈజెఎస్వై, పిఎంఎంఈవై, ఆరోగ్య ఆసరా మొదలైన పథకాలు మరియు నూట ఎనిమిది 108, 102, 104 వాహన సేవలు వినియోగం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వి -టీ మేరీ మణి మరియు ఎంఎల్‌హెచ్‌పిలు ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

వైసీపీకి రాజీనామా..కాంగ్రెస్ పార్టీలో చేరిక

విశాలాంధ్ర - మామిడికుదురు : డీసీసీ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి చేరికలతో పూర్వ వైభవం సంతరించుకుందని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గన్నవరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నగరంలో అమలాపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ అయితాబత్తుల సుభాషిని మంగళవారం కాంగ్రెస్ పార్టీలోకి కొంతమంది నాయకులను ఆహ్వానించారు. వారికి డిసిసి అధ్యక్షులు చిట్టిబాబు కాంగ్రెస్‌పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పిసిసి అధ్యక్షురాలు షర్మిల రెడ్డి నాయకత్వంలో మనమంతా పనిచేసే రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయాలని డిసిసి అధ్యక్షుడు చిట్టిబాబు పిలిపిచ్చారు. వైఎస్ఆర్‌సిపికి చెందిన అల్లవరం మండలం నుంచి బొంతు విజయ్ కుమార్, మాజీ ఎంపీటీసీ వాసంశెట్టి వెంకటేశ్వరరావు, ఉప్పలగుప్తం మండలము నుండి నడింపల్లి సుబ్బరాజు, పందు రవికుమార్లు వైఎస్సార్సీపికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అయినారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ ఆరిఫ్, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు నీతిపూడి బాల సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు అప్పన శ్రీరామకృష్ణ, బత్తుల సురేష్ బాబు పాల్గొన్నారు.

దోమల వ్యాప్తి నివారణకు చర్యలు

విశాలాంధ్ర - గండేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పంచాయతీశాఖ యంత్రాంగం గ్రామాల్లోని, పట్టణాల్లోని దోమలు వ్యాప్తి చెందకుండా అరికట్టేందుకు నివారణ చర్యలను చేపట్టింది. దోమల నివారణ వారోత్సవాల్లో భాగంగా గండేపల్లి మండలం ఎన్టిరాజపురం గ్రామంలో మంగళవారం జడ్పిటిసి పరిమి వెంకటలక్ష్మి మంగతాయారు బాబు, గ్రామ సర్పంచ్ బిక్కిన దేవి దుర్గ గంగాధర్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి సత్య రామ్ నాథ్ రెండవ రోజు గ్రామమంతా డ్రైనేజీల్లో, మురికి కాలువల వద్ద దోమ నివారణ మందులు చల్లించారు. కార్యదర్శి రామనాథ్ మాట్లాడుతూ దోమలు లార్వా దశలో ఉన్నప్పుడు ఎక్కువగా గుడ్ల ఉత్పత్తి పెరిగి వ్యాప్తి చెందుతాయని, దోమ నివారణ మందులు చల్లి నివారించాలని అన్నారు. దోమ కాటు వల్ల డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలుగా ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం గ్రామమంతా పారిశుధ్య కార్మికులచే నివారణ మందులు చల్లించడం జరిగిందని అన్నారు.

కోళ్ల వ్యాను నిలివేత

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లిలో మంగళవారం ఉదయం కోళ్ల దుకాణాల వద్దకు కోళ్లను దించడానికి వచ్చిన వ్యానును దేవరపల్లి పంచాయతీ కార్యదర్శి ఎన్ రవికిషోర్ వ్యాన్లను వెనక్కి పంపించి వేశారు. ఇటీవల కోళ్లకు వ్యాధులు వస్తున్నాయని కారణంతో జిల్లా కలెక్టర్ ప్రశాంతి గుడ్లు చికెన్ దుకాణాలు మూసి వేయించాలని ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాలతో రవి కిషోర్ దేవరపల్లిలో కోళ్లను దించడానికి వచ్చిన వెనక పంపించేశారు. కలెక్టర్ ఆదేశాలు ఉల్లంఘించి కోళ్లు మాంసం అమ్మిన కోళ్లను దించుకున్న చర్యలు తీసుకుంటామని కార్యదర్శి రవి కిషోర్ హెచ్చరించారు.

తాగు, సాగు నీటి ఎద్దడి నివారణకు చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర - కాకినాడ : రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లాలో తాగు, సాగు నీటికి ఎటువంటి ఎద్దడి లేకుండా అధికారులు ప్రణాళిక ప్రకారం పనిచేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో వేసవి కాలానికి అవసరమైన తాగు, సాగు నీరు, రైతు విశిష్ట సంఖ్య నమోదు (ఫార్మర్ రిజిస్ట్రీ) తదితర అంశాలపై మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావనతో కలిసి రెవెన్యూ, వ్యవసాయం, ఇరిగేషన్, ఆర్డబ్ల్యూఎస్, ఇతర శాఖల జిల్లా స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని వివిధ మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు హాజరయ్యారు. జిల్లా కలెక్టర్.. ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు, మండల అధికారులతో మాట్లాడి ప్రస్తుత తాగు, సాగు నీటి వనరుల లభ్యత, భవిష్యత్తు అవసరాలను తెలుసుకున్నారు. అదేవిధంగా తూర్పు డెల్టా, గోదావరి డెల్టా, ఏలేశ్వరం ఆయకట్టు కింద పంటల సాగు వివరాలు, అవసరమయ్యే సాగునీరు, ప్రస్తుత నిల్వల వివరాలను జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్

మాట్లాడుతూ పగటి ఉష్ణోగ్రతలు రోజు రోజుకి పెరుగుతున్నాయని...రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో తాగు, సాగు నీటికి ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా స్థాయి అధికారులు తమ కిందిస్థాయి అధికారులు, సిబ్బందితో సంప్రదింపులు చేసి నిర్దిష్టమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించాలన్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, సాగునీటి చెరువులను నీటితో నింపాలన్నారు. రబీ సాగుకు సంబంధించి ప్రధానంగా తాళ్ళరేవు, కరప, పెదపూడి, కాజులూరు, ఇతర శివారు మండలాల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సాగునీటి సంఘాల నాయకులు, రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అదేవిధంగా పిఠాపురం బ్రాంచ్ కెనాల్ కింద ఉన్న 32,500 ఎకరాలు, ఏలేరు రిజర్వాయర్ కింద 53,017 ఎకరాలకు 15 నుంచి వంతులు వారీగా సాగునీరు విడుదల చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు.

ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య

వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునికరణ (డిజిటలైజేషన్) చేసే ఉద్దేశంతో ప్రభుత్వం రైతులకు 14 అంకెలతో కూడిన ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య (యూనిక్ ఐడి) ఆధార్ కార్డు తరహాలో అందించనున్నదని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. జిల్లాలో సొంత భూమి కలిగిన ప్రతి రైతుతోను ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ పూర్తి చేయించాలన్నారు. భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివిధ పథకాల రాయితీలు పొందాలంటే రైతులు ఈ 14 అంకెల విశిష్ట సంఖ్యను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె వెంకటరావు, వ్యవసాయ శాఖ జేడీ ఎన్ విజయ్ కుమార్, ఇరిగేషన్ ఎస్ఈ కె గోపీనాథ్, ఈఈ జి శేషగిరిరావు, ఆర్డబ్ల్యూఎస్, కాకినాడ నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ పర్యటన వాయిదా

విశాలాంధ్ర - గోపాలపురం: బీమోలు పట్టాదారుల భూ సమస్యలపై బుధవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ పర్యటన కొన్ని ప్రత్యేక కారణాలవల్ల వాయిదా పడినట్లు సీపీఐ జిల్లా పార్టీ కార్యదర్శి తాటిపాక మధు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా రెవెన్యూ పోలీసు యంత్రాంగం సూచనల మేరకు బుధవారం పర్యటన వాయిదా వేయడం జరిగిందని ఆయన అన్నారు. మరొకసారి భూ సమస్యల పరిష్కారానికి ఆయన పర్యటించే తేదీ పత్రికా ప్రకటన తెలియజేస్తామన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తులను గెలిపించండి

విశాలాంధ్ర - కాకినాడ : పట్టభద్రులు అందరికీ న్యాయం చేస్తామని మృదుస్వభావి అందరికీ అందుబాటులో ఉండే వ్యక్తి కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని, ఒకటో నెంబర్ ప్రాధాన్యత ఓటును ఇవ్వాలని డాక్టర్ చప్పిడి, సులుకుర్తి కోరారు. కరప మండలం కరప గ్రామంలో రాష్ట్ర శెట్టిబలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు మాజీ జెడ్పిటిసి నులుకుర్తి వెంకటేశ్వరరావు, మండల టిడిపి అధ్యక్షులు దేవ్ వెంకటేశ్వరరావు, జనసేన మండల అధ్యక్షులు బందారు మురళి, ముద్రగడ రమేష్, కోటికలపూడి దుర్గారావు, బీజేపీ నాయకులు, మండల మహిళా అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, తదితరులతో కలిసి కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపు కొరకు కడప పంచాయతీ ఆఫీసు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ తహసీల్దార్ ఆఫీస్ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం, ఎంఈఓ ఆఫీసు స్థానిక రక్షక భట నిలయం అన్ని ఆఫీసుల్లోనూ రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్ట భద్రులైనటువంటి, విజ్ఞులైనటువంటి ఓటర్లను ప్రతి ఒక్కరి దగ్గరికి వెళ్లి అభ్యర్థించడం జరిగింది.

నులుకుర్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాంగానే మొదట డీఎస్సీ పై చంద్రబాబు నాయుడు సంతకం చేశారని, అలాగే గుంతలు లేకుండా రాష్ట్రంలోని రోడ్లన్నీ పూడ్చారని పెన్షన్లు పెంచారని, అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలియజేశారు. డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వము నిరుద్యోగులకు న్యాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొండా వినాయక నూకరాజు, వెంకటలక్ష్మి, మమ్మిడి పుష్పలత, జనసేన, బిజెపి, తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షలకు 1500 మంది విద్యార్థులు

విశాలాంధ్ర - సామర్లకోట : మార్చి 17 నుంచి జరగనున్న పదవ తరగతి పరీక్షలకు సామర్లకోట మండలంలో 1500 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు మండల విద్యా శాఖాధికారి వై శివ రామకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటనలో తెలుపుతూ మండల పరిధిలో 9 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వాటిలో 1040 మంది, 16 ప్రైవేట్ పాఠశాలలుండగా వాటిలో 460 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్టు తెలిపారు. మొత్తం విద్యార్థుల్లో 767 మంది బాలురు, 733 మంది బాలికలు ఉన్నట్టు చెప్పారు. దీనికి గాను 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఎంఈఓ శివరామ కృష్ణయ్య తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన కాకినాడ స్మార్ట్ సిటీ ప్రెస్ క్లబ్ సభ్యులు

విశాలాంధ్ర - కాకినాడ : అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎప్పటినుంచో కాకినాడలో మీడియా మిత్రులందరికీ ఒకే వేదికపై ఉండాలని కోరుకున్న వారికి దాదాపు విలేకరు లందరూ ఒకే వేదికపైకి వచ్చి నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మంగళవారం జిల్లా కలెక్టర్ షాన్మోహన్ సగిలిని సీనియర్ పాత్రికేయులతో కలిసి ప్రజా స్వామ్యబద్ధంగా జరిగిన ఎన్నికలు విధానాన్ని వివరించి, కాకినాడ స్మార్ట్ సిటీ ప్రెస్ క్లబ్‌కు అన్ని విధాల సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌ని కలిసిన వారిలో సీనియర్ పాత్రికేయులు దురాని స్వాతి ప్రసాద్, అంజిబాబు, సాయినాథ్, ఎన్నికైన నూతన

అధ్యక్షుడు రెడ్డిపల్లి రాజేష్, కోశాధికారి చైతన్య, మేకల రమణ, ఆకెళ్ళ శ్రీనివాస్, త్రినాథ్, గుండె శ్రీనివాస్, తదితర సభ్యులు గవర్నింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

15 గేట్లు వితరణ

విశాలాంధ్ర - పిఠాపురం : స్థానిక కార్తికేయ హాస్పిటల్ మొగిలి కాశీ విశ్వనాథం 15 బార్ గేట్లు చేయించి పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్‌కి ఎస్సైలు మణికుమార్‌కి, జాన్ భాషాకి అందించారు.

13న జాబ్ మేళాకు ఏర్పాట్లు పూర్తి : సత్యం

విశాలాంధ్ర - రామచంద్రపురం : ఈనెల 13న రామచంద్రపురం వివిఎస్ఎం కళాశాలలో నిర్వహిస్తున్న మెగా సాఫ్ట్ వేర్ జాబ్ మేళాకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం వెల్లడిం చారు. భారత దేశంలోని ప్రముఖ ఐటీ సాఫ్ట్ వేర్ కంపెనీలో అర్హతగల నిరుద్యోగులకు ఉపాధి కల్పన ధ్యేయంగా ఈ మెగా సాఫ్ట్ వేర్ జాబ్ మేళా నిర్వహిస్తున్నా మన్నారు. జాబ్ మేళాకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తి చేసామన్నారు. సేవే సత్యం..సేవే నిత్యం నినాదంతో ఈనెల 13న ఉదయం 9 గంటలకు జాబ్ మేళా ప్రారంభమ వుతుందని, ఈ అవకాశాన్ని అర్హులైన వారు ఉపయోగిం చుకోవాలని కోరారు. ఈ జాబ్ మేళాలో భారతదేశంలోని 25 ఐటీ కంపెనీలు హాజరవుతున్నాయన్నారు. సుమారు 300 మందికి పైగా ఉద్యోగాలు కల్పించే దిశగా సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు. జాబ్ మేళాకు 30 సంవత్సరాలలోపు వారు హాజరు కావాలని, ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఉత్తీర్ణత పొందిన వారు ఈ జాబ్ మేళాకు అర్హులని అన్నారు.

ప్రజలకు సేవలు చేయడమే లక్ష్యం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : నియోజకవర్గంలో పేద ప్రజలకు సేవలు అందజేయడం కోసమే ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేశామని ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీరాజు అన్నారు. ఈ సందర్భంగా కాకినాడ సూర్యగ్లోబల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ధర్మవరం గ్రామానికి చెందిన గొనగాని రామకృష్ణ అత్తని, అలాగే మెడికవర్ హాస్పిటల్ ఒమ్మంగి గ్రామానికి చెందిన కొప్పన బాబూరావు భార్యని, అలాగే ధర్మవరంలో దారా కుమారి కుమారుడు నవీన్ కాలికి ఆపరేషన్ అయినా సందర్భంగా నవీన్‌ని పరామర్శించి రూ.5000 ఆర్థిక సాయం ఎంఎంఆర్ ట్రస్ట్ చారిటబుల్ చైర్మన్, ప్రత్తిపాడు వైసీపీ నియోజవర్గ నేత మురళి రాజు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నానిపల్లి చంటి, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు, నల్ల వెంకటేష్, యళ్ళ ఏసు, ముదదా ఏసు తదితరులు పరామర్శించారు.

ముద్రగడ ఇంటిపై దాడికి యువ కాపునాడు ఖండన

విశాలాంధ్ర - అమలాపురం : మాజీ మంత్రి కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం ఇంటి వద్ద దాడిని యువకాపునాడు ఖండించింది. దాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని జాతీయ యువకాపునాడు ప్రచార కార్యదర్శి గారపాటి నాగేశ్వరరావు (పండు బాబు), ఆంధ్రప్రదేశ్ యువ కాపునాడు ఇంచార్జ్ నిమ్మకాయల సురేష్, అమలా పురం యువకాపునాడు అధ్యక్షులు అరిగేల తేజ వెంకటేష్, అమలాపురం నియోజవర్గం యువకాపునాడు అధ్యక్షులు భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు.